తేల్చుకుందాం రా

- నామినేషన్ ర్యాలీలో వైసీపీ నేతల బాహాబాహి
- విస్తుపోయిన సూళ్లూరుపేట జనం


ప్రచార రథంపైనే వాగ్వాదం


వైసీపీ నేతలకు సర్దిచెబుతున్న సీఐ మధుబాబు


బుజ్జగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: ఎన్నికల వేళ అధికార పార్టీ నేతలు మరోమారు బహిరంగంగా గొడవలకు దిగారు. ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ దౌర్జన్యం చేస్తావా రారా... తేల్చుకుందాం అంటూ ఓ నాయకుడు సవాల్ విసరగా.. దిగి రారా నీ అంతు చూస్తానంటూ మరో నాయకుడు ప్రతి సవాల్ విసిరాడు.సూళ్లూరుపేటలో గురువారం వైసీపీ అభ్యర్థిగా కిలివేటి సంజీవయ్య నామినేషన్ వేసేందుకు వెళ్లే ర్యాలీలో ప్రచారం రథంపైనే ఈ గొడవ చోటు చేసుకుంది. ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైసీపీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి మధ్య జరిగిన ఈ వివాదం పార్టీలో తీవ్ర దుమారం రేపింది. సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మూడో సెట్ దాఖలు చేసేందుకు నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి జన సమీకరణ చేయించి ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.బస్టాండు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రచార రథాన్ని సిద్ధం చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో నాయుడుపేట నుంచి వాహన ర్యాలీగా ప్రచార రథం వద్దకు కిలివేటి చేరుకొన్నారు. అప్పటికే ప్రచారరథంపై చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ డి.బాలచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డి.శ్రీమంత్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఉన్నారు.కిలివేటి వెనుక వచ్చిన ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ప్రచార రథం పైకి ఎక్కా రు. కిలివేటి పక్కనే నిలబడి ఉన్న బాలచంద్రా రెడ్డి, శేఖర్‌రెడ్డిని నెట్టేందుకు యత్నించారు. మీరేంట్రా ప్రచార రథంపై ఉండేది... కిందకు దింపండిరా అంటూ మాట్లాడడం వివాదానికి దారి తీసింది. వెంటనే జోక్యం చేసుకొన్న దువ్వూరు ఇది మంచి పద్ధతి కాదంటూ వారించేందుకు ప్రయత్నించారు. దీంతో శేఖర్ రెడ్డి ప్రచార రథం ముందుభాగం బ్యానెట్ పైకి చేరుకొని నువ్వెవడ్రా ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ మాట్లాడుతున్నావంటూ ప్రశ్నించారు. తొడలు కొట్టుకుంటూ చెప్పులు సైతం చూపించుకొంటూ సవాళ్ల ప్రతి సవాళ్లు విసురుకున్నారు. ఇదంతా కిందనుంచి చూస్తున్న వైసీపీ శ్రేణులు అసలు ఏమి జరుగుతుందోనని ఆందోళనకు గురయ్యారు.కిలివేటి ఆ ఇద్దరినీ బుజ్జగించినా ఫలితం లేకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.సీఐ మధుబాబు ప్రచార రథం పైకెక్కి సత్యనారాయణ రెడ్డిని వారించి ప్రచార రథం బ్యానెట్‌పై శేఖర్ రెడ్డిని కూర్చోబెట్టారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కౌన్సిలర్ మీజూరు రామకృష్ణ కూడా ప్రచారం రథంపైకి ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. అదే సమయంలో సత్యనారాయణ రెడ్డి మున్సిపాలిటీ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డితో వాగ్వాదానికి దిగారు.కిలివేటి ఆ ఇద్దరినీ బుజ్జగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. పోలీసులు ప్రచార రథం సమీపంలో ఉన్న నాయకులను పక్కకు పంపడంతో ర్యాలీ బయలుదేరింది. ఈ నెల 14న జరిగిన ప్రచారంలో కూడా ఇరు వర్గాలు బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే.ప్రశాంతంగా ఉండే సూళ్లూరుపేటలో వీధి రౌడీల్లా వైసీపీ నేతలు కయ్యానికి కాలుదువ్వడంపై అధికార పార్టీలో సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.


వైసీపీ శ్రేణులను నిలువరిస్తున్న పోలీసులు - (ఇన్‌సెట్‌లో) రాయి విసురుతున్న వైసీపీ కార్యకర్త

అదుపుతప్పిన ఉత్సాహం


టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత

- పోటాపోటీగా ఇరు పార్టీల భారీ ర్యాలీలు
- పోటాపోటీ నినాదాలతో తోపులాటలు
- లాఠీఛార్జితో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి
- పోలీసుల వైఫల్యమే కారణం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 25: ప్రశాంతంగా సాగిన నామినేషన్ల పర్వంలో చివరిరోజు ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా కార్యకర్తల నడుమ ఘర్షణ, రాళ్లదాడి జరిగింది. పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రెచ్చిపోయిన టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి వాహనంపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు.వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని గురువారం నామినేషన్లు దాఖలు చేసేందుకు చంద్రగిరిలో భారీ ర్యాలీలు నిర్వహించారు.అక్కడి నుంచీ వాహనాల కాన్వాయ్‌తో తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు.రెండు పార్టీలూ పోటాపోటీగా జనసమీకరణ చేయడంతో వేలసంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. వైసీపీ అభ్యర్థి మోహిత్ తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలసి ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్ళిన కాసేపటికి టీడీపీ అభ్యర్థి నానీ కూడా లోనికి వెళ్లారు. వెలుపల టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండడంతో వైసీపీ కార్యకర్తలు ప్రతిగా నినాదాలు చేశారు. ఈ ఉత్సాహం అదుపు తప్పడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. రాళ్ళు, జెండా కర్రలతో కొట్టుకున్నారు.ఆలస్యంగా మేలుకున్న పోలీసులు లాఠీఛార్జి జరిపి టీడీపీ వర్గీయులను చెదరగొట్టారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు అప్పుడే ఆర్డీవో కార్యాలయం నుంచీ వెలుపలికి వచ్చి బయల్దేరి వెళుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై జెండా కర్రలు, రాళ్ళతో దాడి చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఆయన వెళ్ళిపోయారు. ఆ సందర్భంగా కూడా ఇరు పార్టీల కార్యకర్తలూ పరస్పరం రాళ్ళు విసురుకున్నారు. అనంతరం పులివర్తి నానీ వెలుపలికి రావడంతో ఆయన వెంట కార్యకర్తలు వెళ్ళిపోయారు.మరి కాసేపటికి మోహిత్‌రెడ్డి బయటకు రాగా వైసీపీ కార్యకర్తలు ఆయ న వెంట వెళ్ళిపోవడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

ఇద్దరు అభ్యర్థులూ ఒకేసారి రావడంతో....

మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో మోహిత్‌రెడ్డి కొద్దిమంది వైసీపీ కార్యకర్తలతో కలిసి వాహనాల్లో ఎమ్మార్‌పల్లి సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రాస్ బిల్డింగ్ సమీపంలో 100 మీటర్ల నియంత్రణ రేఖవద్ద పోలీసులు వైసీపీ కార్యకర్తల వాహనాలను నిలువరించి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి కారును మాత్రం ఆర్వో కార్యాలయం వద్దకు అనుమతించారు. అయితే కొందరు వైసీపీ కార్యకర్తలు ఆర్వో కార్యాలయ సమీపంలోకి చేరుకున్నారు. తరువాత కొంత సేపటికి అన్నమయ్య సర్కిల్ వైపునుంచి టీడీపీ,బీజేపీ,జనసేన శ్రేణులతో కలసి పులివర్తి నాని ఊరేగింపుగా వచ్చారు. ఇటువైపు 100 మీటర్ల నియంత్రణ రేఖవద్ద ఉన్న పోలీసులు... అభ్యర్థితో పాటు నలుగురు మాత్రమే ఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లాలని, మిగిలిన కార్యకర్తలకు అనుమతి లేదని సూచించారు.దీంతో అన్నమయ్య కూడలి నుంచి ద్విచక్రవాహనంపై నామినేషన్ కేంద్రం వద్దకు నాని వెళ్లారు. ఆ ప్రాంతంలో ఉన్న వైసీపీ కార్యకర్తలు నానీని చూడగానే జై జగన్ అంటూ నినాదాలు ప్రారంభించారు. ఇది చూసిన టీడీపీ కార్యకర్తలు ఒక్క ఉదుటన ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని జగన్ పోవాలి... సైకిల్ రావాలి , జై నానీ అని ప్రతి నినాదాలు చేశారు. దీంతో సంయమనం కోల్పోయిన ఇరు వర్గాలూ బాహాబాహీకి దిగారు.జెండా కర్రలతో దాడులకు పూనుకున్నారు. ఈ క్రమంలో ఒకరిద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించినా ఎవ్వరూ వెనక్కు తగ్గలేదు.పరిస్థితి విషమిస్తుండడంతో పోలీసులు లాఠీ చార్జి చేసి టీడీపీ శ్రేణులను చెదరగొట్టారు.మధ్యాహ్నం 120 గంటల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. జరిగిన ఘటనలతో అప్పటికే ఆవేశంతో ఉన్న టీడీపీ కార్యకర్తలు చెవిరెడ్డి కారును చుట్టుముట్టారు. నినాదాలుచేస్తూ కారును నిలువరించేందుకు ప్రయత్నించారు. ఆవేదనతో జెండా కర్రలతో కారుపై దాడిచేశారు. పక్కనే రోడ్డు మరమ్మతులకోసం తెప్పించి పెట్టిన కంకర రాళ్ళతో కారుపై దాడిచేశారు. పోలీసులు వారిని అడ్డుకుని చెవిరెడ్డి కారును సురక్షితంగా పంపించివేశారు. తరువాత కూటమి కార్యకర్తలు విసిరిన గులకరాళ్లతో వైసీపీ కార్యకర్తలు దాడికి దిగడంతో యుద్ధవాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు కష్టమ్మీద ఇరు వర్గాలను అడ్డుకుని దాడులు తీవ్రతరం కాకుండా నిలువరించారు.తరువాత 2 గంటలకు పులివర్తి నాని నామినేషన్ ముగించుకుని ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేస్తూ కొంతసేపు అక్కడే ఉండి ఆ తరువాత అక్కడి నుంచి బయలుదేరారు.ఆయనతో పాటే కార్యకర్తలు కూడా అక్కడినుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం సుమారు 2.20 గంటల సమయంలో వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి నామినేషన్ ముగించుకుని ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చి తన అనుచరులతో కలిసి వెళ్లిపోయారు.

అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు:నాని

తన నామినేషన్‌ను అడ్డుకునేందుకు చెవిరెడ్డి, అయన వర్గీయులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని, తమ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని నామినేషన్ తరువాత పులివర్తి నాని మీడియాకు చెప్పారు. మంచి ముహూర్తం ఉన్నందున చివరిరోజున ప్రధాన నామినేషన్ వేస్తానని తాను మొదటి రోజే చెప్పానని, అయితే వారు మూడు తేదీలు, సమయాలు మార్చుకుని తాను నిర్ణయించుకున్న సమయానికే నామినేషన్ పెట్టుకున్నారన్నారు. ఇది కాకతాళీయం కాదని గొడవ చేయాలనే తలంపుతో ప్రణాళిక ప్రకారం చేశారని ఆరోపించారు. ఓడిపోతున్నామనే అక్కసుతోనే చెవిరెడ్డి ఈ దాడులు చేయిస్తున్నారన్నారు. వారెన్ని దాడులు చేసినా తాము ఆవేశపడేది లేదని, ఎన్నికలయ్యేవరకు సంయమనంతో వ్యవహరిస్తామని అయన చెప్పారు. ఐతే ఈ దాడులపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.


వైసీపీ శ్రేణులను అదుపు చేస్తున్న పోలీసులు

ముందుగానే తెలిసినా...

ఇద్దరు అభ్యర్థులు చివరి రోజునే, ఒకే సమయంలో నామినేషన్‌కు వస్తారని తెలిసినా పోలీసులు తగినవిధంగా బందోబస్తు చర్యలు చేపట్టకపోవడమే ఈ ఉద్రిక్తతలకు కారణంగా కనబడుతోంది. రెండు ప్రధాన పార్టీలు, పెద్దసంఖ్యలో కార్యకర్తల బలమున్న పార్టీలు నామినేషన్‌కు ర్యాలీగా తరలి రానున్న నేపథ్యంలో అందుకు తగినట్టు పోలీసు బలగాలను కూడా పెద్దసంఖ్యలో మోహరించాల్సి ఉంది. ఆ మేరకు బలగాలు లేకపోవడంతో ఇరు పార్టీల కార్యకర్తలు కలబడి దాడులు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆర్వో కార్యాలయ మార్గంలో గులక రాళ్ల గుట్టలు ప్రమాదకరంగా మారుతాయని పోలీసులు గుర్తించలేక పోయారు.వీటిని ముందుగానే పరిగణనలోకి తీసుకోకపోవడం, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వంటి పోలీసు వైఫల్యాలతోనే ఆర్డీవో కార్యాలయం వద్ద ఘర్షణ జరిగింది.


రాయి విసురుతున్న వైసీపీ కార్యకర్త

వెంకటగిరిలో కొండెక్కిన కోడ్

- వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు వచ్చిన జనానికి నగదు, బిరియానీ పంపిణీ
- జనానికి తప్పని ట్రాఫిక్ కష్టాలు


నగదు పంపిణీ



వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 25 : వెంకటగిరిలో గురువారం వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన జనానికి బహిరంగంగానే రూ.300 నగదు, బిరియాని పొట్లాలు పంపిణీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో రావడంతో ప్రధాన వీధులన్నీ రద్దీగా మారాయి.ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నగదు అందుకున్న జనంలో కొంతమంది ఎక్కడ మద్యం షాపులు కనిపిస్తే అక్కడ ఆగిపోయి తాగి తూలారు.వృద్ధులను, చిన్న పిల్లలను కూడా నామినేషన్ కార్యక్రమానికి తీసుకురావడంతో వారు ఎండతీవ్రతకు తాళలేక అల్లాడిపోయారు.సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ప్రజలకు నీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి.


వైన్ షాపు వద్ద వైసీపీ శ్రేణులు

చివరి రోజు 155 నామినేషన్లు

- పార్లమెంటుకు 20... అసెంబ్లీకి 135
- అత్యధికంగా తిరుపతికి 34
- ఏడు రోజుల్లో ఎంపీకి48... అసెంబ్లీకి 242




భారీ ప్రదర్శనగా నామినేషన్ వేసేందుకు వస్తున్న పులివర్తి నాని

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన గురువారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంటుకు 20 నామినేషన్లు ఫైల్ కాగా ఏడు అసెంబ్లీ స్థానాలకూ కలిపి 135 నామినేషన్లు వచ్చాయి. వీటిలో తిరుపతికి అత్యధికంగా 34 నామినేషన్లు వేశారు. కాగా ఈనెల 18వ తేదీ నుంచీ గురువారం వరకూ ఏడు రోజుల్లో తిరుపతి పార్లమెంటు స్థానానికి మొత్తంగా 48 నామినేషన్లు ఫైల్ అయ్యాయి. అలాగే ఏడు అసెంబ్లీ స్థానాలకు కలిపి 242 నామినేషన్లు వచ్చాయి. స్థానాల వారీగా చూస్తే తిరుపతికి 83, చంద్రగిరికి 63, శ్రీకాళహస్తికి 44, సత్యవేడుకు 38, గూడూరుకు 35, సూళ్ళూరుపేటకు 31. వెంకటగిరికి 31 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.కాగా చివరి రోజు నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల విషయానికి వస్తే తిరుపతి పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు, బీజేపీ డమ్మీగానూ, ఇండిపెండెంట్‌గానూ వేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, వైసీపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి, బీఎస్పీ అభ్యర్థిగా రిటైర్డు జడ్జి పి.గుర్రప్ప, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి వేలూరు తేజోవతి వున్నారు. అసెంబ్లీ స్థానాల్లో సూళ్ళూరుపేటకు టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, వైసీపీ అభ్యర్థి సంజీవయ్య, కాంగ్రెస్ అభ్యర్థి చందనమూడి శివ, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి బిగువ శ్రీనివాసులు వున్నారు. వెంకటగిరిలో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్, సమాజ్‌వాదీ అభ్యర్థి పాతపాటి చిరంజీవి, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి చెముకుల శివకృష్ణ వున్నారు. గూడూరులో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్, శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, సమాజ్‌వాదీ అభ్యర్థి డి.గోవిందస్వామి, సత్యవేడులో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రిటైర్డు ఐఏఎస్ అధికారి జి.విజయ్‌కుమార్ వున్నారు. చంద్రగిరిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ, వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వున్నారు. తిరుపతిలో వైసీపీ డమ్మీ అభ్యర్థిగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నామినేషన్ వేశారు.

టీడీపీలో ముగ్గురికి పదవులు
జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనబాక లక్ష్మి

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి నియమితులయ్యారు. గురువారం పార్టీ చేపట్టిన నియామకాల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో ముగ్గురికి కీలక పదవులు లభించాయి. పనబాక లక్ష్మి జాతీయ కమిటీలో స్థానం దక్కించుకోగా తిరుపతికి చెందిన కోడూరు బాలసుబ్రమణ్యం రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం దక్కించుకున్నారు. కాగా చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన గుర్రం వెంకటేష్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.తాజా ఎన్నికల్లో పనబాక లక్ష్మి ఎంపీ సీటు, ఆమె భర్త కృష్ణయ్యకు గూడూరు లేదా సూళ్ళూరుపేట అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే సమీకరణలు అనుకూలించకపోవడంతో ఇద్దరిలో ఎవరికీ అవకాశం దక్కలేదు. దీన్ని దృష్టిలో వుంచుకుని అధినేత ఆమెకు జాతీయ కమిటీలో అవకాశం కల్పించారు. అలాగే తిరుపతి సీటు జనసేనకు కేటాయించి, అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించగా టీడీపీ నుంచీ కోడూరు బాలసుబ్రమణ్యం మినహా ఎవరూ ప్రారంభంలో మద్దతు ప్రకటించలేదు.ఈ కారణంగానే అధినేత ఆయనకు అధికార ప్రతినిధిగా అవకాశమిచ్చినట్టు సమాచారం.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం


గరుడ వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

రామచంద్రాపురం, ఏప్రిల్ 25: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గంగిరెడ్డిపల్లె, కమ్మకండ్రిగ, నడవలూరు, వెంకటాపురం కోదండ రామాలయాల్లో గురువారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాత్రి మేళ తాళాల నడుమ గరుడ వాహనంపై సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

సిద్ధార్థలో ఆకట్టుకున్న పొటెంజా


ఎగ్జిబిట్స్‌ని పరిశీలిస్తున్న కొండారెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, ఏప్రిల్ 25: తిరుపతి రూరల్ మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో పొటెంజా-2కే24 పేరిట విద్యార్థులు గురువారం నిర్వహించిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఎస్పీడీసీఎల్ సోలార్ ఇన్‌చార్జి ఎన్.దేవేంద్రనాథ్‌తో కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి కలిసి ఈ ప్రదర్శన ప్రారంభించారు. సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్ చైర్మన్ వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, ట్రిపుల్‌ఈ హెడ్ బాలసుబ్రమణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

రాష్ట్రస్థాయిలో టెన్త్‌లో నాల్గవ, ఇంటర్‌లో మొదటిస్థానం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదలచేసిన ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఇంటర్‌లో 87.40శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటిస్థానం, టెన్త్‌లో 86.59శాతం ఉత్తీర్ణతతో నాల్గవస్థానం సాధించారని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. గతనెలలో జరిగిన టెన్త్ పరీక్షలకు జిల్లాలో 1066మంది విద్యార్థులు హాజరవగా.. 923మంది పాసై 86.59శాతం ఉత్తీర్ణత నమోదు చేశారన్నారు. ఇంటర్ పరీక్షలకు 2540మంది విద్యార్థులు హాజరవగా.. 2220మంది విద్యార్థులు పాసై 87.40శాతం ఉత్తీర్ణత నమోదు చేశారని వెల్లడించారు.

జూన్ 1నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఏపీఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటినుంచి ఎనిమిదో తేదీవరకు జరగనున్నాయి. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30గంటలవరకు పరీక్షలు జరుగుతాయని డీఈవో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులు ఈనెల29నుంచి మే4వతేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. అపరాధ రుసుంతో మే10వతేదీ వరకు గడువుందని తెలిపారు. ఇంటర్మీడియట్ థియరీకి ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్ ఫీజు రూ.100చెల్లించాలి. టెన్త్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ ర్యాంకులు

- ఓపెన్ కేటగిరీలో 225 ర్యాంకు
- ఒకే విద్యార్థినికి దివ్యాంగుల కేటగిరీలో ఎనిమిది, ఈడబ్ల్యూఎస్‌లో రెండో ర్యాంకు


జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ డీజీఎం, ఏజీఎం తదితరులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో తిరుపతికి చెందిన నారాయణ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేటగిరీలో రాయపాటి పుష్కర్ 225 ర్యాంకు సాధించగా, గుండా జోష్మిత.. దివ్యాంగుల కేటగిరీలో ఎనిమిది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో రెండో ర్యాంకు వచ్చింది. వీరితో పాటు ప్రసాద్ 253, జశ్వంత్ 255, హితేష్ రాహుల్ 274, వివేకానందరెడ్డి 285, మునివెంకటరెడ్డి 324, ప్రకాష్ 384, సాయిప్రసన్న 512, మైత్రిశ్రీ 553, కృష్ణ 608, వివస్వత్ 1629, నాగసుమేధ్ 3819, బాలాజి 4712, రుత్వికొరెడ్డి 4945, ఆదిత్య నివాస్ 5303 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు 12, ఐదు వేలలోపు 28, పదివేలలోపు 34 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని నారాయణ డీజీఎం కొండలరావు, ఏజీఎం గోపీచంద్ తెలిపారు. ఉపాధ్యాయులతో కలిసి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కంప్యూటర్ ఇంజనీర్ అవుతా



మాది రామచంద్రాపురం మండలం నూతిగుంటపల్లె. ఉపాధ్యాయుడు రాయపాటి నాగేశ్వరనాయుడు, నెల్లూరి పుష్ప మా తల్లిదండ్రులు 300 మార్కులకుగాను 291 మార్కులు సాధించా. మ్యాథ్స్, కెమిస్ట్రీలో నూటికి నూరు శాతం మార్కులు వచ్చాయి. ఓపెన్ కేటగిరీలో 225 ర్యాంకు వచ్చింది. చిన్నప్పటినుంచి కంప్యూటర్ ఇంజనీర్ కావాలనేది నా లక్ష్యం. తదుపరి దశల్లోకూడా మంచి మార్కులు సాధించి నా లక్ష్యం నెరవేర్చుకుంటా.

- రాయపాటి పుష్కర్ (225 ర్యాంకు, ఓపెన్ కేటగిరీ)

చెన్నై ఐఐటీలో సీటు సాధించడమే ధ్యేయం



మాది తిరుపతి కరకంబాడి. కిరాణా దుకాణం నడిపే శ్రీనివాస్, తల్లి సుమలత మా తల్లిదండ్రులు. నాకకు దివ్యాంగుల కేటగిరీలో ఎనిమిది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో రెండో ర్యాంకు వచ్చింది. కంప్యూటర్స్ నాకు ఇష్టం. అందువల్ల చెన్నై ఐఐటీలో సీటు సాధించడమే నా ధ్యేయం.

- గుండా జోష్మిత (2వ ర్యాంకు, దివ్యాంగుల కేటగిరీ)

ఊరందూరువాసికి 253వ ర్యాంకు


తల్లిదండ్రులతో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 25: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరుకు చెందిన నాగోలు సురేంద్రరెడ్డి, ప్రవీణ దంపతుల కుమారుడు యశ్వంత్ కుమార్ రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 253వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి రాజమండ్రిలోని తిరుమల కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. అక్కడే శిక్షణ తీసుకుని పరీక్ష రాశాడు. తల్లిదండ్రులిద్దరూ అగ్రికల్చర్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 25: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, పలుశాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

శిల్పారామంలో సమ్మర్‌క్యాంప్

తిరుచానూరు, ఏప్రిల్ 25: శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్స్ క్యాంపును చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఖాదర్‌వలీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సెలవురోజుల్లో చిన్నారులకు మన ప్రాచీన కళలను పరిచయం చేసేందుకుగాను మే 1నుంచి నెల రోజులపాటు టెర్రకోట బొమ్మలు చేయడం, డ్రాయింగ్, పెయింటింగ్ బేసిక్స్, శాస్త్రీయ, జానపద నృత్యంలో బేసిక్స్ నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ మూడు కోర్సులకు రూ.వెయ్యి రుసుం చెల్లించాలన్నారు. 4నుంచి 18 సంవత్సరాల లోపు వారికి ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు. మరిన్ని వివరాలకు 8886652044, 8886652016 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవంగా కోదండరాముడి చక్రస్నానం

- ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు
- నేడు శ్రీరామ పట్టాభిషేకం


చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం, ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి, ఏప్రిల్ 25: చంద్రగిరి కోదండరామస్వామివారి ఆలయంలో గురువారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం నిర్వహించాక సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలకు, చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా జరిగింది. తర్వాత అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ఆలయ ప్రాంగణంలోని గంగాళంలో చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. దీంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి ఏడు గంటల వరకు శ్రీరామపట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కంకణ భట్టర్ శ్రీనివాస భట్టర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఆసరా ఇంకెప్పుడు ఇస్తారు..?

రామచంద్రాపురం, ఏప్రిల్ 25: వైఎస్‌ఆర్ ఆసరా మూడు నెలలుగా జాప్యం కావడంతో ఇంకెప్పుడు ఇస్తారంటూ ఇందిరాక్రాంతి పథకం అధికారులను స్వయం సహాయక సభ్యులు నిలదీస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఈ ఏడాది జనవరి 23న ముఖ్యమంత్రి జగన్.. ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు నగదు జమ చేయడానికి బటన్ నొక్కారు. మండలంలో మొత్తం 793 స్వయం సహాయక మహిళా గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూప్ సభ్యులకు ఆసరా పథకం ద్వారా రూ.7,64,99,712లను జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 582 గ్రూప్‌ల్లోని 5,158 మందికి రూ.5,70,30,268లు పంపిణీ చేశారు. మిగిలిన 211 గ్రూప్‌ల్లోని 1,873మందికి రూ.1,94,69,444లు రావాల్సి ఉంది. నిధులు రావడం జాప్యం కావడంతో సంబంధిత కార్యాలయం చుట్టూ గ్రూపు మహిళా సభ్యులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

చంద్రగిరిలో నాగాలమ్మ, ఎల్లమ్మకు పూజలు

- అంబేడ్కర్‌కు నివాళులు అర్పించిన పులివర్తి నాని


నాగాలమ్మకు పూజలు చేస్తున్న పులివర్తి నాని, కుటుంబ సభ్యులు, చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి

చంద్రగిరి, ఏప్రిల్ 25: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నామినేషన్ దాఖలు సందర్భంగా గురువారం ఉదయం చంద్రగిరి జాతీయ రహదారిలోని నాగాలమ్మకు, మూలస్థాన ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్, కోడలు త్రిష్యరెడ్డి, టీడీపీ నాయకులు డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, సుబ్రహ్మణ్యం నాయుడు, కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు నాగాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మూలస్థాన ఎల్లమ్మను దర్శించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంగళం నుంచి తరలివెళ్లిన టీడీపీ, జనసేన శ్రేణులు

మంగళం: చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం, రణధీరపురం, సప్తగిరికాలనీ, తిరుమలనగర్ పంచాయతీల్లో ఉన్న టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గురువారం టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని నామినేషన్‌కు స్వచ్ఛందంగా భారీగా తిరుపతి తరలివెళ్లారు. దాదాపు 2వేల మందికిపైగా 130 ఆటోలు, 300 బైక్‌లలో పసుపు జెండాలు చేతపట్టి ఊరేగింపుగా బయలుదేరివెళ్లారు. దీంతో మంగళం పరిధిలోని నాలుగు పంచాయతీల రోడ్లు పసుపు మయంగా మారాయి. నామినేషన్ వేయడానికి వెళ్లే ముందు పులివర్తి నానికి పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.


మంగళం నుంచి, మెట్టూరు వద్ద నాని నామినేషన్‌కు బయలుదేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నామేషన్‌కు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు 3వేలమంది గురువారం తరలివెళ్లారు. పలు గ్రామాల నుంచి బస్సులు, వ్యాన్‌లలో కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. ఆయా గ్రామకమిటీ నాయకులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి, జిల్లా నాయకులు జనార్దన్ చౌదరి, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, జేడీ జగన్, ఢిల్లీనాథరెడ్డి, ధనంజయరెడ్డి, నాయకులు గిరి నాయుడు, సురేంద్ర నాయుడు, మహేష్, మధుసూదన్‌రెడ్డి, జగదీష్, మాధవయ్య పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

- తిరుపతి, గూడూరులో పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 5,119మంది విద్యార్థులు


ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ శనివారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. జిల్లాలో తిరుపతి, గూడూరుల్లోని 14 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షకు 5,119మంది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం 9.30గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని, 10గంటలనుంచే లోనికి అనుమతిస్తామని చెప్పారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. తిరుపతిలోని ఎనిమిది సెంటర్లలో 3,972మంది విద్యార్థులు, గూడూరులోని ఆరు సెంటర్లలో 1,147మంది విద్యార్థులు కలిపి మొత్తంగా 5,119మంది పరీక్ష రాయనున్నారని వివరించారు.

పరీక్ష కేంద్రాలివీ..

తిరుపతిలో.. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఎస్వీఎస్ హైస్కూల్ (కేటీరోడ్డు, టీటీడీ ఏడీబిల్డింగ్ ఎదురుగా), శ్రీపద్మావతి బాలికల ఉన్నతపాఠశాల (బాలాజీకాలనీ), ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల బ్లాక్-ఏ, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల బ్లాక్-బీ(శ్రీపద్మావతి డిగ్రీ కళాశాల దగ్గర), ఎస్వీడబ్ల్యూ పాలిటెక్నిక్ (ఎస్వీ డెయిరీఫాం దగ్గర), శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల బ్లాక్-ఏ, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల బ్లాక్-బీ(పద్మావతి గెస్ట్‌హౌస్‌రోడ్డు). ● గూడూరులో డీఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాల, గవర్నమెంట్ పాలిటెక్నిక్, ఎస్‌కేఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, జడ్పీ బాలికల హైస్కూల్, జడ్పీ బాలుర హైస్కూల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ.

బేల్దార్ హత్య


మృతుడు ఆసీఫ్

చిత్తూరు, ఏప్రిల్ 25: చిత్తూరు నగరంలో గురువారం రాత్రి బేల్దార్ హత్యకు గురయ్యాడు. తనతో పనిచేసేవారు ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తితో పొడిచి పారిపోయారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... కేరళకు చెందిన ఆసీఫ్, హైదరాబాదుకు చెందిన నసీమాను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు నెలల క్రితం నగరంలోని తోటపాళ్యంలో ఓ అద్దె ఇంటిలో చేరారు. ఆసీఫ్ బేల్దార్ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి ఆసిఫ్ తనతో పాటు పనిచేసే బద్రి, పవన్‌తో కలిసి ఓబనపల్లె మద్యం షాపు వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తూ పవన్ తీసుకొచ్చిన కొత్త ఫోన్‌లో మాట్లాడాలని ముగ్గురు వాదులాడుకున్నారు. ఈ క్రమంలో ఆసిఫ్ బద్రి వద్ద ఉన్న ఫోన్‌ను లాక్కొని ఇంటికి వెళ్లిపోయాడు. ఫోన్ తీసివ్వమని పవన్ బద్రిని నిలదీశాడు. ఇద్దరూ కలసి ఆటోలో తోటపాళ్యం చేరుకున్నారు. ఇంట్లో ఉన్న ఆసిఫ్‌ను బయటకు పిలిచి ఫోన్ ఇవ్వమని నిలదీశారు. ఇవ్వకపోవడంతో పవన్, బద్రి కలసి బీర్ బాటిల్‌తో ఆసిఫ్ తలపై దాడి చేసి, పరారయ్యారు. ఈ దాడిలో ఆసిఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సీఐ ఉలసయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారు చెప్పిన సమాచారం మేరకు బద్రియే హత్య చేశాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బద్రిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

షార్ ఉద్యోగి ఆత్మహత్య


కోదండ గంగేశ్వర్ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: షార్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసే ఎం.కోదండ గంగేశ్వర్ (31) ఉరే సుకున్నాడు. ఎస్‌ఐ కోట రహీంరెడ్డి సమాచారం మేరకు... కాకినాడ జిల్లా తొండంగి మండలం, పెద్ద కొండ గ్రామానికి చెందిన గంగేశ్వర్ షార్‌లో ఎంవీఐటీ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం బీ4- 153లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. బుధ వారం విధులకు హాజరయ్యాడు. గురువారం ఉద యం 10 గంటలైనా రాకపోవడంతో సహచర ఉద్యో గి ఆయన ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నట్టు గుర్తించాడు. వెంటనే చుట్టుపక్కల వారితో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని గదిని పరిశీలించారు. భవిష్యత్తును తలచుకొని వివాహమైతే ఎలా బతకాలో మనవేదనకు గురై ఉరేసుకుంటున్నట్టు రాసిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుయాలో 'ఈ-ఆస్పత్రి' సేవలెక్కడ?

- ఇబ్బంది పడుతున్న రోగులు


రోగులు సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్న ఎక్స్‌రే రిపోర్టు, చిన్న కాగితంపై రాసిచ్చిన మందుల చీటీ


మధ్యాహ్నం ఓపీలో డాక్టర్ల కోసం నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 25: రుయాస్పత్రిలో దాదాపు రెండేళ్లుగా ఈ-ఆస్పత్రి సేవలు అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. కానీ అటువంటి సేవలేవీ ఇక్కడ అమలు కాక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ-ఆస్పత్రి అంటే అన్నీ ఆన్‌లైన్ ద్వారానే నడవాలి. కానీ ఇక్కడ మాత్రం కాగితాలపైనే అన్నీ నడుస్తున్నాయి. ఉదయం ఓపీకి వచ్చిన రోగులకు రక్తపరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే వంటివి తీసుకురావాలని వైద్యులు సూచిస్తారు. ఇక అప్పటి నుంచి రోగులకు కష్టాలు మొదలవుతాయి. వైద్యులు రాసిచ్చిన చీటీని పట్టుకుని వైద్య పరీక్షల గదులకు వెళ్లాలి. అక్కడ స్కానింగ్, ఎక్స్‌రే తీయించుకుంటే వాటి రిపోర్టులను రోగులే నేరుగా సెల్‌ఫోన్లలో చిత్రీకరించి తెచ్చుకోవాలి. రక్తపరీక్షల కేంద్రంలోనూ వాటి ఫలితాలను చిన్నపాటి కాగితాలపైనే రాసిస్తారు. వీటిలో ఏ రిపోర్టు చేజారినా మళ్లీ చేయించుకోక తప్పడం లేదు. ఇంతా చేసి మధ్యాహ్నం ఓపీకి వస్తే వైద్యులు ఉండటం లేదని, దీనివల్ల రిపోర్టులను వైద్యుడికి చూపించాలంటే మళ్లీ వారంలో కేటాయించిన రోజున రావాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. అలాగే మందుల కోసం మరో చీటీని పట్టుకుని క్యూలైన్లలో నిల్చోవాలి.

సూపర్ స్పెషాలిటీ సేవల సంగతిలా..

రెండు నెలల కిందట రుయాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఓ పది మంది వైద్యులను నియమించి చేతులు దులుపుకుంది. వీరికి అవసరమైన ఎలాంటి వైద్య పరికరాలను ఇంతవరకు సమకూర్చలేదు. అలాగే ప్రత్యేకంగా ఎలాంటి నిధులను కూడా కేటాయించలేదు. దీనివల్ల ఈ వైద్యులు కూడా ఓపీ సేవలకే పరిమితమవుతున్నారు.


చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల వరప్రసాదరావు, టీడీపీ నాయకులు గణపతి నాయుడు, బడి సుధాయాదవ్, కుమారుడు వినీల్‌తో కలిసి నామినేషన్ పత్రాలు అందచేస్తున్న పులివర్తి నాని


నామినేషన్ సందర్భంగా నానీని అభినందిస్తున్న తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్

'మీ దరఖాస్తులు తీసుకోం'

400 మంది పోలీసుల ఫాం 12 తీసుకోని ఉన్నతాధికారులు

చిత్తూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటారు. దానికి సంబంధించిన ఫాం 12ను ఆయా శాఖల హెచ్‌వోడీల వద్ద ఉద్యోగులు అందించేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 26వ తేదీ వరకు గడువును పొడిగించింది. పోలీసులూ ఎన్నికల విధుల్లో ఉంటారు కాబట్టి వారికీ పోస్టల్ బ్యాలెట్ అవసరముంటుంది. జిల్లాలో 1,850 మంది అన్ని స్థాయిల్లో పోలీసులున్నారు. వారి నుంచి ఫాం 12 దరఖాస్తులు పొందేందుకు ఈనెల 23 గడువును జిల్లా పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. 1,445 మంది గడువులోగా ఫాం12 అందించారు. మిగిలిన వారంతా గురువారం జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు అందించేందుకు వచ్చారు. కానీ ఉన్నతాధికారులు దరఖాస్తులు తీసుకునేందుకు గడువు అయిపోయిందని వెనక్కి పంపించేశారు. శుక్రవారం వరకు గడువున్నా ఇలా సుమారు 400 దరఖాస్తులను తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ సర్కారు మీద తీవ్ర స్థాయిలో అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. వీలైనంత వరకు ప్రభుత్వ ఉద్యోగ ఓట్లను తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇటీవల టీచర్లకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ విషయంలోనూ అడ్డగోలు నిబంధనలతో అధికారులు గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. పుంగనూరులో దాదాపు 150 ఓట్లు, నగరి ఆర్వో కార్యాలయంలో 400 ఓట్లు చెల్లుబాటు కాకుండా గట్టి ప్రయత్నాలు జరిగాయి.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ వైసీపీ జెండాలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ జెండాలు కట్టి కేరింతలు కొట్టి చిందులేసిన సంఘటన గురువారం సూళ్లూరుపేటలో జరిగింది. వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. నామినేషన్ ర్యాలీకి వైసీపీ నాయకులు ఆయా ప్రాంతాల నుంచి జనసమీకరణ చేసుకుని ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ జెండాలు కట్టి హంగామా చేశారు. అక్కడే పోలీసులు, ఎంసీసీ, ఎన్నికల నిఘా టీంలున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

బోయకొండ హుండీ ఆదాయం రూ.74.79 లక్షలు

చౌడేపల్లె, ఏప్రిల్ 25: బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ.74.79 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం చేపట్టిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.74,79,615 నగదు, 42 గ్రాముల బంగారు, 540 గ్రాముల వెండి, యూఎస్ 5డాలర్ల నోటు ఒకటి, 1 డాలర్ల నోట్లు 2, ఒమన్ 100 బైస ఒక నోటు, కెనడా 5 సినక్యూ డాలర్ నోటు ఒకటి, 5వినగట్ డాలర్ ఒకటి, సౌదీ అరబ్ ఒక రియాల్ నోట్లు వచ్చాయని వారు వెల్లడించారు. 63 రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. రణబేరిగంగమ్మ ఆలయానికి రూ.53,046 నగదు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హైమావతి, బుడ్డమ్మ, భాస్కర్‌రెడ్డి, గ్రూప్ టెంపుల్స్ ఈవో చలపతి పాల్గొన్నారు.

పోలీసుల వేధింపులు తట్టుకోలేక.. యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన కార్తీక్‌రెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 25 : పోలీసుల వేధింపులు తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. అడవినాథునికుంటకు చెందిన శేఖర్ రెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి (26) గ్రామంలో చిన్న దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఒక వివాహిత మూడు రోజులుగా కనిపించడం లేదు. ఆమెతో కార్తీక్‌రెడ్డికి వివాహేతర సంబంధం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లి ఆచూకీ చెప్పాలని చితకబాదినట్లు తెలిసింది. ఈ క్రమంలో అదృశ్యమైన మహిళ బుధవారం గ్రామానికి చేరుకోవడంతో పోలీసులు అతన్ని విడుదలచేశారు. స్టేషన్‌లో పోలీసుల వేధింపులను అవమానంగా భావించిన కార్తీక్‌రెడ్డి గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈవిషయం బయటకు రాకుండా పోలీసులు స్థానికంగా ఉన్న ఒక నేతతో కలిసి పంచాయితీ చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు.

కుప్పంలో 18 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు

కుప్పం, ఏప్రిల్ 25: కుప్పంలో నామినేషన్ల ఘట్టం ముగిసిన గురువారం నాటికి 18 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి మొత్తం 32 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన గురువారం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నీలమ్మ, టీకే.దుర్గాపాణిని, కె.ప్రకాశ్, బి.మురళీధర్, వెంకట్రామ్ రెడ్డి పార్థసారథి రెడ్డి, తిమ్మరాయప్పలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. అలాగే పిరమిడ్ పార్టీ నుంచి డి.ప్రసాద్, బహుజన సమాజ్ పార్టీ నుంచి గణేశ్, టీడీపీ అభ్యర్థి చంద్రబాబు తరపున ఆ పార్టీ నాయకులు, విడుదలై చిరుతైగళ్ కట్చి పార్టీ తరపున గోవిందప్ప, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున వి.జగదీశ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎ.గోవిందరాజులు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా కె.రూప నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు ముగిసేసరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రబాబు 4 సెట్లు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ 4 సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల గోవిందరాజులు 3, బీఎస్పీ అభ్యర్థి గణేశ్ 2, వీసీకే పార్టీ అభ్యర్థి గోవిందప్ప 3, వైసీపీ రెబల్ అభ్యర్థి మురళీధర్ 2, స్వతంత్ర అభ్యర్థి తిమ్మరాయప్ప 2, స్వతంత్ర అభ్యర్థి నీలమ్మ 2 సెట్లు నామినేషన్లు వేశారు. వీరుగాక భారతీయ ప్రజాగళ కళ్యాణ పక్ష అభ్యర్థి అక్బర్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి రూప, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ప్రసాద్, స్వతంత్ర అభ్యర్థులుగా వైసీపీ ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ, ప్రకాశ్, నాగరాజు, రామచంద్రప్ప, సురేంద్ర కుమార్‌లు ఒక్కో సెట్టు నామినేషన్ వేశారు.

ఎన్నికల హోరు.. వీవీఐపీల హడావిడి

ఏర్పాట్లలో తలమునకలైన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25: ఎన్నికల హోరుకు తోడు వీవీఐపీల హడావిడితో అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం సాయంత్రం బెంగళూరు నుంచి విమానంలో తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడినుంచి రోడ్డుమార్గాన తాజ్ హోటల్‌కు చేరుకుని రాత్రికి అక్కడే బసచేశారు.

నేడు ఉపరాష్ట్రపతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ శుక్రవారం ఉదయం 10.35 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి కారులో తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే మూడో వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. 2.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాదు వెళతారు. ● రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం సాయంత్రం 5.15 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి చిత్తూరు వెళ్లి, రాత్రికి అక్కడే బసచేస్తారు. శనివారం చిత్తూరులో నూతనంగా నిర్మించిన 15 భవనాల కోర్టు కాంప్లెక్సును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి తిరుపతిలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌కు వెళ్లి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరుకు వెళతారు.

ఎస్వీయూలో 11నుంచి వేసవి సెలవులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25: ఎస్వీయూనివర్సిటీలో మే 11వ తేదీ నుంచి వేసవి సెలవులు ఇవ్వనున్నారు. దీంతో 2023-24 విద్యా సంవత్సరానికి మే 10వ తేదీ చివరి పనిదినంగా నిర్ణయించారు. ఈ సెలవులు జూన్ 9వ తేదీ వరకూ ఉంటాయి. జూన్ 10వ తేదీ నుంచి వర్సిటీలో తరగతులు పునః ప్రారంభం కానున్నాయి. వీసీ శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ హుస్సేన్ ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

3న ఆర్ట్స్ కాలేజీ డే

ఎస్వీయూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీడే మే 3వ తేదీ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేపడుతోంది. అంతకుముందు విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు కాలేజీడేలో బహుమతులు ప్రదానం చేస్తారు. పోటీలకు కో-ఆర్డినేటర్లుగా ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి (ఫిజికల్ ఎడ్యుకేషన్), డాక్టర్ శంకర్ గణేష్ (ఫైన్ ఆర్ట్స్) నియమించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పద్మనాభం ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టరేట్‌లో పోలీస్ అబ్జర్వర్ పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్‌గా నియమితులైన అరవింద్‌సాల్వే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా కమాండ్ కంట్రోల్ రూమ్, సి-విజిల్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పోలీసు, సి-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జీపీఎస్, నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ఫిర్యాదులకు సంబంధించి 91541 41876 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట అధికారులు చంద్రశేఖర్, దశరథరామిరెడ్డి, సతీష్, పోలీసు అధికారులున్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 25: మలేరియా వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని డీఎంహెచ్‌వో శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామనాథతో కలిసి గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనతోనే మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని చెప్పారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి రామకృష్ణ సర్కిల్ వరకు ఈ ర్యాలీ జరిగింది. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి, మలేరియా అధికారి రూప్‌కుమార్, డీపీఎంవో శ్రీనివాసులు, డీఐవో శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలకు స్వస్తి పలుకుదాం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25: కుటుంబ కలహాలకు స్వస్తి పలుకుదామని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు సూచించారు. గురువారం రాస్ ప్రధాన కార్యాలయంలో పెరుగుతున్న కుటుంబ కలహాలను తగ్గించే అంశంపై సదస్సు జరిగింది. డైరెక్టర్ వి.నాగరాజు, మానసిక నిపుణుడు డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, న్యాయ నిపుణులు వి.ఎస్.రంగనాథం, సభ్యులు జి.సుధారాణి, డాక్టర్ వి.నందిని, వై.అంకమ నాయుడు, సి.బాలాజీరెడ్డి, పి.కవిత పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 25: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. ఆస్పత్రిలోని లెక్చరర్ గ్యాలరీలో ఆయన గురువారం హెచ్‌వోడీలు, డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. హెచ్‌వోడీలు సైతం నిత్యం వారి విభాగాల్లో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు వైద్యవిద్యార్థులకు చక్కటి తర్ఫీదును ఇవ్వాలన్నారు. అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఏఆర్‌ఎంవో హరికృష్ణ, క్లినికల్ పర్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.66 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.66 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 64,080 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,773 మంది తలనీలాలు సమర్పించారు.

రుయాలో నర్సుల మధ్య ఆధిపత్య పోరు!

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 25: రుయాస్పత్రిలో నర్సుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఇటీవల పదోన్నతి పొంది, బదిలీపై ఆరుగురు హెడ్‌నర్సులు రుయాకు వచ్చారు. వీరిలో అరుణ అనే హెడ్‌నర్సు జాయిన్ అయిన వెంటనే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. గురువారం ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. సాధారణంగా రుయా బోధనాస్పత్రి కావడంతో ఇక్కడ వైద్యులు, హెడ్‌నర్సులు వారి జాయినింగ్ రిపోర్టును రుయా అనుసంధానం ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేసి, ఆయన ఇచ్చిన ఉత్తర్వులను సంబంధిత విభాగాధిపతులకు అందించి విధుల్లో చేరుతారు. అయితే అరుణ మాత్రం మొదట ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసినా.. ఆపై అక్కడ ఇచ్చే నివేదికలను నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 లేదా గ్రేడ్-2 అధికారులకు అందించాలి. వారి సమక్షంలో హెడ్‌నర్సుకు క్యాప్ పెట్టి బాధ్యతలు అప్పగించాలి. కానీ నర్సింగ్ అధికారులు ఇద్దరూ లేకుండానే యూనియన్ నేతల పేరుతో కొందరు హెడ్‌నర్సులు కొత్తగా వచ్చిన హెడ్‌నర్సుకు క్యాప్ పెట్టి విధులు కేటాయించడం, సత్కారం చేయడం పలు విమర్శలకు తావిచ్చింది. ఇకనైనా జిల్లా అధికారులు ఈ అంశంపై దృష్టి పెటాల్సి ఉంది.



హెడ్‌నర్సుకు క్యాప్ పెడుతున్న ఇతర నర్సులు

ఆరణి శ్రీనివాసులు విజయం ఖాయం

గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయండి - ఆరణి కుమార్తె, కోడలు ప్రచారం

తిరుపతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసుల విజయం ఖాయమైందని కూటమి నేతలు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరణి కుమార్తె సునీత, కోడలు శ్రావణి గురువారం పలు డివిజన్లలో పర్యటించి.. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. 30వ డివిజన్ నెహ్రూనగర్లో టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆరణి సునీత పాల్గొన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ తిరుపతిలో ప్రశాంత వాతావరణం రావాలన్నా, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్నారు. విజ్ఞులైన ఓటర్లు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని, ఆదిశగానే ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ నాయకులు మునికృష్ణ, శీను, రేఖ, సుబ్బలక్ష్మి, గోవిందాచారి, మధు, మంజు, నాగరాజులు పాల్గొన్నారు. అదేవిధంగా 36వ డివిజన్లో ఆరణి శ్రావణితో పాటు కూటమి నేతలు సుబ్బుయాదవ్, ఆముదాల తులసీరాం, శంకర్ యాదవ్, వినోద్ రాయల్, శేష తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి విమానాశ్రయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కి పుష్పగుచ్ఛమిస్తున్న ఆరణి శ్రీనివాసులు



30వ డివిజన్లో ప్రచారం చేపడుతున్న ఆరణి శ్రీనివాసులు కుమార్తె సునీత, టీడీపీ నేత ఊకా విజయకుమార్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'శ్రీధర్స్' జయకేతనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఏఐఆర్ బైపాస్‌రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. మిథున్‌చాంద్ 2043 ర్యాంకు, కె.హర్షవర్ధన్‌రెడ్డి 5641, ఎ.శ్రీకర్ 5802, పి.జగత్‌కుమార్ 6315, ఎస్.వంశీకృష్ణారెడ్డి 8700, వి.సిద్దార్థరెడ్డి 11549, లిపిత 15371, ఎం.కిన్నెర 17653, వి.వేదవ్యాస్ 23,601, జి.శిరీష 29047 ర్యాంకులు సాధించారన్నారు. వీరిని అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీధర్ తదితరులు

'శ్రీచైతన్య' ప్రభంజనం

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఏజీఎం బీవీ ప్రసాద్ పేర్కొన్నారు. హరికృష్ణ నాయక్ 309, నిఖిల్ 333, కుమార్‌రెడ్డి 562, కుషల్ 683, రోహిత్ 975, ఉజ్వల్‌కుమార్ 1042, మహితాచౌదరి 1087, ప్రేమానందరెడ్డి 1149, యశ్వంత్‌సాయి 1340, జ్యోత్స్న 1540, గణేష్‌కుమార్‌రెడ్డి 1826, మహిత 1960, శివచరణ్ 2216, మహరాజ్‌నాయక్ 2495, సాహిత్య 3277, వేనికాచౌదరి 4696, తేజస్విని 4704, పవిత్ర 4930 వంటి ర్యాంకులు పొందారని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు 405మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను డీన్లు కేఎల్వీ ప్రసాద్, రామమోహన్‌రావు, సంపత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులతో ఏజీఎం బీవీ ప్రసాద్ తదితరులు

ఆరణిని గెలిపించుకురండి

● టీడీపీ, జనసేన నేతలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆదేశం

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను గెలిపించుకు రావాలని తమ పార్టీ నేతలను చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలో ఎన్నికల ప్రచారం ముగించుకుని గురువారం రాత్రి తిరుపతి విమానాశ్రయానికి తొలుత పవన్ కల్యాణ్ చేరుకున్నారు. 20 నిమిషాల తర్వాత చంద్రబాబు కూడా విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఆయన కుమారుడు జగన్‌తో పవన్ ప్రత్యేకంగా మాట్లాడారు. అందరినీ కలుపుకెళ్లాలని సూచించారు. అనంతరం చంద్రబాబు కూడా ఆరణితో మాట్లాడాక.. టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్‌లతో ప్రత్యేకంగా చర్చించారు. పొత్తుల్లో భాగంగా జనసేనకు తిరుపతిని కేటాయించామని, అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకు రావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, నాయకులు దంపూరి భాస్కర్, చినబాబు, బుల్లెట్ రమణ, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, వినుత, సుభాషిణి, రాజారెడ్డి, కిరణ్ రాయల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అధినేత చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వరప్రసాద రావు - కొల్లూరి లక్ష్మికి సత్కారం

కోట/గూడూరు, ఏప్రిల్ 25: తనకు మరోసారి అవకాశం ఇస్తే తిరుపతి పార్లమెంట్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. గురువారం ఆయన కోట పట్టణంలోని ఓ ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గూడూరు ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. అక్కడ నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అక్కడ నుంచి నేరుగా గూడూరు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ అభ్యర్థులకు అండగా ఉండాలని కేంద్రంలో మోదీని ప్రధాన మంత్రిగా చేయాలని, రాష్ట్రంలో చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. వారితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం ఆయన పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను కలుసుకొని మద్దతు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, పొదలకూరు ఆర్యవైశ్య ప్రముఖులు శ్రీనివాస్, అమలూరి చెంచయ్య, పొట్టి సుధాకర్, సురేంద్ర, కామేశ్వర రావు, మీరా మధు, కృష్ణం వెంకట రమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అయోధ్య రామయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరప్రసాద్ సతీమణి విస్తృత ప్రచారం

రాపూరు/పొదలకూరు: తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి కోరారు. గురువారం ఆమె రాపూరు, పొదలకూరులలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

తిరుపతికి భారీ ఎత్తున కేంద్ర బలగాల రాక

● సీఆర్‌పీఎఫ్ కింద మూడు కంపెనీలు
● సీఐఎస్ఎఫ్ బలగాలు మరో మూడు కంపెనీలు
● తమిళనాడు నుంచి 4,000 మంది పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి వీలుగా భారీ ఎత్తున కేంద్ర బలగాలు రానున్నాయి. ఇప్పటికే బీఎస్ఎఫ్ బలగాలు నెలరోజుల క్రితమే మూడు కంపెనీలు అంటే దాదాపు 240 మంది వచ్చారు. వీరు చంద్రగిరి, తిరుపతి, గూడూరు, నాయుడుపేట ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించి, ఓటర్లలో చైతన్యం కలిగిస్తున్నారు. చంద్రగిరి, గూడూరు, తిరుపతిలో ఎన్నికల రోజు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని భావించి.. అదనంగా కేంద్ర బలగాలు అవసరమని జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీనాటికి అండమాన్ నికోబార్ దీవుల నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలు దాదాపు మూడు కంపెనీలు రానున్నాయి. ఇందులో ప్రతి కంపెనీకి 75 మంది ఉంటారు. అంటే 225 నుంచి 230 మంది జిల్లాకు చేరుకుంటారు. వీరిలో ఒక కంపెనీ చంద్రగిరికి, మరో కంపెనీ శ్రీకాళహస్తికి, ఇంకో కంపెనీ గూడూరుకు పంపనున్నట్లు అధికారిక సమాచారం. ఇదిలా ఉండగా సీఐఎస్ఎఫ్ బలగాలు అదనంగా మరో మూడు కంపెనీలు వస్తున్నాయి. ప్రతి కంపెనీలో దాదాపు 25 మంది ఉంటారు. వీరిని అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో ఘర్షణలు, విధ్వంసాలు, ఓటింగ్ మిషన్ల అపహరణ వంటివి చోటు చేసుకోకుండా ముందస్తుగా మొహరించనున్నారు. వీరితోపాటు తమిళనాడు నుంచి మరో 4,000 మంది పోలీసులు అవసరం ఉందని లేఖ రాయడంతో అక్కడినుంచి సైతం భారీ ఎత్తున పోలీసు బలగాలు వస్తున్నాయి. వీరే కాకుండా ఎస్‌పీఎఫ్, ఏపీఎస్‌పీ, రిజర్వ్ బలగాలు, జిల్లాకు చెందిన అన్నిస్టేషన్ల పోలీసులను ఎన్నికల బందోబస్తుకు నియమించనున్నారు. ఈసారి ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల పంపకాలు, ప్రలోభాలు, భయపెట్టడం వంటి వాటికి చెక్ పడే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

పెట్రో బాంబ్ కలకలం!

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 25: చంద్రగిరి టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద రెండు పార్టీల కార్యకర్తల మధ్య దాడులు, ప్రతి దాడులతో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ సమయంలో పెట్రో బాంబ్ అంటూ కలకలం రేగింది. పెట్రోలు నింపిన బాటిల్‌తో ఓ యువకుడు అటుగా వచ్చాడు. గమనించిన ఓ పోలీసు అధికారి ఆ యువకుడిని పట్టుకుని, బాటిల్‌ను లాక్కుని అందులోని పెట్రోల్‌ను కిందకు ఒంపేశారు. 'ఎవరు నువ్వు.. పెట్రోల్ బాటిల్‌తో ఇటువైపు ఎందుకు వచ్చావు' అని ఆ యువకుడిని పోలీసులు ప్రశ్నిస్తుండగా పక్కనే ఉన్న టీడీపీ కార్యకర్తలు దీన్నిచూసి ఖంగుతిన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసేందుకే పెట్రోలు బాటిల్‌తో అక్కడకు వచ్చాడని, అతను వైసీపీ కార్యకర్తేనంటూ చుట్టుముట్టారు. దాంతో పోలీసులు ఆ యువకుడిని పోలీస్ వ్యాన్ ఎక్కించారు. దీనిపై ఆ యువకుడు మాట్లాడుతూ.. తాను కర్నూలుకు చెందినవాడినని, రాస్‌లో డీఈడీ చదువుతున్నానన్నాడు. తన ద్విచక్రవాహనంలో పెట్రోలు అయిపోవడంతో బాటిల్లో పెట్రోలు పోసుకుని వెళ్తున్నట్టు చెప్పాడు. వైసీపీతో తనకు ఎటువంటి సంబంధం లేదని.. కావాలంటే రాస్‌లో తన గురించి వాకబు చేసుకోవాలన్నారు. విచారించి.. వాస్తవాలు తెలుసుకుని అతను నిజంగా విద్యార్థి అయితేనే వదిలిపెడతామని పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో పెట్రోల్ బాటిల్‌తో వచ్చిన యువకుడు

ఇదేమి 'స్టాండ్' వకీల్ సాబ్



ఎన్నికల ప్రచారంలో చంద్రశేఖర్ రెడ్డి

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆయన తిరుపతి నగరపాలక సంస్థలో స్టాండింగ్ కౌన్సిల్ లాయర్. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి న్యాయపరమైన వివాదాలను పరిష్కరించడం చంద్రశేఖర్ రెడ్డి విధి. అందుకు నెలవారీ వేతనం కూడా కార్పొరేషన్ సాధారణ నిధులు నుంచి చెల్లిస్తోంది. ఈ మధ్యనే ఆయన వేతనాన్ని పెంచుతూ కౌన్సిల్లో తీర్మానం చేశారు. ఆ కృతజ్ఞతతోనో ఏమో వైసీపీ ఎన్నికల ప్రచారంలో వీర సైనికుడిలా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ జెండాను తలపాగా చుట్టి, టీషర్టుకు జగన్‌రెడ్డి సిద్ధం లోగో తగిలించుకుని సందుల్లో, గొందుల్లో తిరుగుతూ స్వామి భక్తి చాటుకుంటున్నారు. అది కూడా చిన్నపిల్లల చేత జెండా పట్టించి ప్రచారంలో పాల్గొంటున్నారు. తిరుపతి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ వ్యవహరిస్తున్నారు. ఆమె ఇలాకాలోనే ఇలా బరితెగించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ మందు




"అన్నా.. బాగుండారు గదా.. గెలవబోయేది మళ్లీ మనమే. మనం కోరుకున్నది చేసుకోవచ్చు. ఎలక్షను ఖర్చులు బాగా పెరిగిపోయినాయని తెలుసుకదా. మనోడు వొచ్చి కలుస్తాడు. మరిచిపోబాకండి" అంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యాపారులకు ఫోన్‌లు వస్తున్నాయి. అయిదేళ్లుగా అధికార పార్టీ దందాలు కళ్లజూసిన వీరు ఇటువంటి ఫోన్ రాగానే హడలిపోతున్నారు. మొబైల్ మోగగానే ఎక్కడి నుంచా అని ఆందోళనగా చూస్తున్నారు. నాయకుడి అసలు నెంబరు నుంచి గాక ప్రతిసారీ ఏదో కొత్త నెంబరు నుంచే ఫోన్‌లు వస్తున్నాయి. అడిగినంత ఇచ్చుకోలేక, అలా అని ఇవ్వకపోతే ఏమవుతుందో అనే భయం వదులుకోలేక వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. 'ఇసుకలో బానే ఎనకేసుకున్నారు గదా. భూములు, పంచాయతీలు అని కోట్లు సంపాయిస్తిరి.. ఇప్పుడు మళ్లీ మనమింద పడ్డారేంది స్వామీ' అని ఒకరికొకరు కలబోసుకుని కడుపు చించుకుంటున్నారు.

– రేణిగుంట



రాష్ట్ర మంత్రి రోజా ఎక్కే గడప దిగే గడపతో సతమతమవుతున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కీలకనాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆమె అలెర్ట్ అయ్యారు. అసమ్మతి వర్గ నేతల పట్ల ఇప్పటిదాకా ఉన్న బింకాన్ని సడలించుకుని వారి ఇళ్లకు తిరుగుతున్నారు. ఏలుమలై మొదలియార్ వర్గంకే చెందిన వైసీపీ నాయకుడు నారాయణబాబు ఇంటికి వెళ్లి తనకు సహకరించాలని రోజా కోరారు. అలాగే విజయపురం మండలంకు చెందిన అసమ్మతి నాయకుడు లక్ష్మీపతిరాజును కలిసేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. బుధవారం నగరి మున్సిపాలిటీకి చెందిన మొదలియార్ సామాజికవర్గంలో కీలక నాయకుడు పురుషోత్తం మొదలియార్‌ను ఆయన ఇంట్లోనే కలిశారు. అదే రోజు మధ్యాహ్నం నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ ఇంటి గడప తొక్కారు. 'ఇప్పటి వరకు జరిగిందేదో జరిగిపోయింది...ఈ ఎన్నికల్లో నాకు సహకరించండి' అంటూ వారందరినీ కోరుతున్నట్లు సమాచారం. అయితే వెళ్లిన ప్రతిచోటా సానుకూలత లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. రెండు వారాల క్రితం తిరుపతిలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డి వారి చక్రపాణిరెడ్డిని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిసింది. 'జరగాల్సిన నష్టం జరిగిపోయాక ఇప్పుడు గడప గడపకు తిరిగి లాభం ఏమిటి' అనే నిట్టూర్పులు వైసీపీలోనే వినిపిస్తుండడం విశేషం.


– పుత్తూరు అర్బన్




- ఖాతాల్లో జమ కాని విద్యాదీవెన, వసతి దీవెన సొమ్ము
- విద్యా సంవత్సరం ముగుస్తోందని విద్యార్థులు ఆందోళన
- అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న తల్లిదండ్రులు
- జగన్ మాటలకు మోసపోయామంటూ లబోదిబో

మీ బిడ్డల చదువుల విషయం నాకొదిలేయండి. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో పెద్ద చదువులు చదివించండి.

– విద్యార్థుల తల్లిదండ్రులకు సీఎం జగన్ తరచూ చెప్పే మాటలివి





బటన్ నొక్కి రెండు నెలలు..
డబ్బులేవి జగన్ మామా..!

రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇందుకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను క్రమం తప్పకుండా అమలుచేస్తున్నామంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆయన పచ్చి అబద్ధాలు చెబుతున్నారని అర్థం అవుతుంది. విద్యాదీవెన పథకంలో ప్రారంభ సంవత్సరం నుంచి పలు అంశాలను సాంకేతిక కారణాల సాకుగా చూపుతూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ వచ్చారు. ఆఖరు సంవత్సరానికి మొత్తం చేతులెత్తేశారు.

– తిరుపతి(కలెక్టరేట్)

పేద విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల్లో రూపాయి కూడా ఫీజు రూపంలో చెల్లించాల్సిన పని లేదని, అంతా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చిన జగన్ ఆచరణలో విద్యార్థుల నడ్డివిరిచారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సాయాన్ని జమ చేయడానికి ఆయన బటన్ నొక్కి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాలేదు. ఐదేళ్లుగా పథకాలకు నిధులు సక్రమంగా విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విద్యాసంవత్సర త్రైమాసికానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈఏడాది మార్చి 1న ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ఫోటో ఫోజులిచ్చి నమూనా చెక్కులు విడుదల చేశారే తప్ప డబ్బులు జమయ్యాయా లేదో తెలుసుకోలేదు. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా పథకాల సొమ్ము అందలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే వార్షిక పరీక్షలకు అనుమతిస్తామంటున్నాయి. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

జిల్లాలో కాకిలెక్కలు

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు వసతి దీవెన కింద రూ.188.92 కోట్లు, విద్యాదీవెన కింద రూ.475.23 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. క్షేత్రస్థాయికి వచ్చే సరికి తల్లిదండ్రుల ఖాతాల్లో చాలా వరకు నగదు జమ కాలేదు. ఇక చివరకు ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి 39,368 మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేస్తున్నట్లు ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. కానీ తమకు అందలేదని విద్యార్థులూ, తల్లిదండ్రులూ చెబుతున్నారు.

అప్పు చేసి సర్టిఫికెట్లు తీసుకున్నాం



అప్పు చేసి రూ.56 వేలు ఫీజు కడితే సర్టిఫికెట్లు ఇచ్చారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం కూడా పూర్తయింది. విద్యాదీవెన రాలేదు. అధికారులను అడిగితే తెలియదన్నారు. ఫీజు కడితేకానీ సర్టిఫికెట్లు ఇవ్వమని కళాశాల యాజమాన్యం చెప్పింది. చేసేది లేక మా తల్లిదండ్రులు అప్పు చేశారు. మాలాంటి పేదవారిపట్ల ప్రభుత్వం ఇలాగేనా ప్రవర్తించేది.

– వై.లోకేష్(బీటెక్), ఆర్‌సీపురం

ప్రభుత్వం మోసం చేసింది

మా తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. లేకపోతే పూటగడవదు. ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివినప్పుడు విద్యాదీవెన కింద ప్రభుత్వం రూ.8వేలు ఖాతాలో వేసింది. ఇపుడు డిగ్రీ పూర్తవుతోంది. ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఎలా ఫీజు కట్టేది. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేయడం కరెక్టేనా.



– వినయ్, మిట్టగాంధీ పురం, తిరుపతి రూరల్

ఒక విడత కూడా అందలేదు

విద్యాదీవెన ఆసరాగా ఉంటుందని ఓ ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులో చేరాను. ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ చదువుకు ఉపయోపడుతుందనుకున్నా. విద్యాదీవెన ద్వారా ఇప్పటి వరకు ఒక విడత కూడా సాయం అందలేదు. అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నా. విద్యా దీవెన ఎప్పటికొస్తుందో అర్థం కాకుండా ఉంది.

– వంశీకృష్ణ, చిల్లకూరు





ఇంకా జమకాలేదు

నేను తిరుపతిలోని ఓప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాను. జగన్ మామయ్య బటన్ నొక్కి రెండు నెలలవుతోంది. ఇప్పటికీ రూపాయి కూడా జమకాలేదు. విద్యాసంవత్సరం కూడా ముగుస్తోంది. డబ్బులు ఎపుడు వస్తాయో తెలియని పరిస్థితి.

– విశాల్, తిరుపతి రూరల్

డబ్బులు రాని బటన్ నొక్కడం ఎందుకు



అధికారంలోకి వస్తానే విద్యావ్యవస్థకు పెద్దపీట వేసి పేద విద్యార్థులకు సొంత మామయ్యలా అండగా ఉంటానని సీఎం జగన్‌రెడ్డి డాంబికాలు పలికారు. ఉత్తిత్తి బటన్లు నొక్కుతున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా తల్లిదండ్రుల ఖాతాల్లో పైసా కూడా జమ కాకపోవడం దుర్మార్గం. ముమ్మాటికీ ప్రభుత్వం మోసం చేసినట్లే.

– ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి



సత్యవేడు చరిత్ర

టీడీపీకి పెట్టని కోట

1983 తరువాత ఆరుసార్లు గెలిచిన తెలుగుదేశం

రెండుసార్లు మాత్రమే కాంగ్రెస్ విజయం



ఎప్పుడు ఆవిర్భవించింది : 1962
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13

నియోజకవర్గంలో మండలాలు:
సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం.

ఎమ్మెల్యేలు

1962	టి.బాలక్రిష్ణయ్య	కాంగ్రెస్
1967	కె.మునస్వామి	స్వతంత్ర
1972	సి.దాస్	కాంగ్రెస్
1978	సి.దాస్	కాంగ్రెస్
1983	తలారి మనోహర్	టీడీపీ
1985	ఎం.సురాజ్	టీడీపీ
1989	సి.దాస్	కాంగ్రెస్
1994	ఎం.సురాజ్	టీడీపీ
1999	ఎన్.శివప్రసాద్	టీడీపీ
2004	కె.నారాయణస్వామి	కాంగ్రెస్
2009	హెచ్.హేమలత	టీడీపీ
2014	తలారి ఆదిత్య	టీడీపీ
2019	కోనేటి ఆదిమూలం	వైసీపీ

ఓటర్ల వివరాలు
మొత్తం : 2,11,378
పురుషులు : 1,02,568
మహిళలు : 1,08,797
ఇతరులు : 13

సత్యవేడు,ఏప్రిల్ 24: టీడీపీకి సత్యవేడు నియోజకవర్గం పెట్టని కోట. 1983లో ఆ పార్టీ ఆవిర్భవించాక వరుసగా టీడీపీ విజయదుందుభి మోగిస్తోంది. కేవలం రెండు సార్లు మాత్రమే కాంగ్రెస్ గెలవగలిగింది. తమిళనాడు సరిహద్దులోని ఈ నియోజకవర్గం 1961కు ముందు ఆ రాష్ట్రంలోని నాటి చెంగల్‌పట్టు జిల్లా తిరువళ్ళూరు తాలూకాలో అంతర్భాగంగా ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా పటాస్కర్ అవార్డు ప్రకారం 1962 ఏప్రిల్ 2న ఆంధ్రప్రదేశ్‌లో కలిసింది. తొలుత ఏడు మండలాలుండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విజనలో భాగంగా తొట్టంబేడు, పెళ్ళకూరు మండలాలను దీని నుంచి వేరు చేశారు. నారాయణవనం, కేవీబీపురం మండలాలను కలిపారు. ఇప్పటి వరకూ అత్యదికంగా ఆరుసార్లు టీడీపీ గెలుపొందింది. ఐదుసార్లు కాంగ్రెస్ గెలుపొందింది. 1978 ఎన్నికల వరకూ ఈ నియోజకవ్గంలో కాంగ్రెస్ విజయకేతనం గెలవగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం తర్వాత పరిస్థితి తారుమారు అయింది. టీడీపీ హవా కొనసాగించింది. కాంగ్రెస్ రెండుసార్లు మాత్రమే గెలిచింది. 1978లో గెలుపొందిన సీ.దాస్, 1999లో ఎన్నికైన ఎన్.శివప్రసాద్ మాత్రమే మంత్రులుగా పనిచేశారు.

వైసీపీ నేతల చెరలో చెరువులు

- రూపాయి చెల్లించకుండా అక్రమార్జన

అధికారం అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. ప్రశ్నిస్తే ఏం జరుగుతుందోనని ప్రజలు మౌనంగా భరిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండల పరిధిలో పంచాయతీ చెరువులను అధికార పార్టీ నేతలు గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించకుండా దర్జాగా చెరువుల్లోని చేపలను అమ్ముకుంటున్నారు. లక్షల్లో వెనకేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండల పరిధిలో పంచాయతీ, సొసైటీ చెరువులు 52 ఉన్నాయి. ఇందులో పంచాయతీ ఆధీనంలో 19 పెద్ద చెరువులున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సంవత్సరం వేలం పాట నిర్వహించారు. తరువాత 2020 కరోనా రావడంతో 2021లో గతంలో పాడిన వారికి నష్టాలు చూపుతూ కొనసాగించారు. ఆ తరువాత నుంచి గామాల్లోని వైసీపీ నేతలు చెరువుల వేలం జరగనివ్వకుండా సిండికేట్ అయిపోతున్నారు. సాధారణంగా గత పాట ధరకు ప్రతి ఏటా పదిశాతం పెంచాల్సి ఉంది. వైసీపీ నేతల ఒత్తిడితో ఐదు శాతం మాత్రం పెంచుకుని 19 చెరువులనూ దక్కించుకున్నారు. ఎలమండ్యం, ఆర్ మల్లవరం, కరకంబాడీ, వెదళ్ల, అనుగుంట, చీరాలమ్మ, అత్తూరు, గాజులమండ్యం, తూకివాఆకం, కోట్ర మంగళం, జీపాళెం, ఆంనేయపురం, రాఘవపురం చెరువులకు ఇప్పటి వరకు రూపాయి చెల్లించలేదు. గత ఏడాది పాడుకున్న తుమ్మలగుంట, లక్ష్మమాక చెరువులకు సైతం పైసా చెల్లించలేదు. రేణిగుంట మండల పరిధిలోని మత్స్యకార శాఖ ఆధీనంలోని 33 సొసైటీ చెరువులను సొసైటీ సభ్యుల పేరుతో వైసీపీ నేతల బినామీల అతి తక్కువ ధరతో దక్కించుకుంటున్నారని సమాచారం. ఇప్పటికీ ప్రతి వారంలో రెండుసార్లు చెరువులో చేపలను పట్టి దర్జాగా బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.


వైసీపీ నేతల ఆధీనంలో ఉన్న వెంకటాపుం పెద్దచెరువు

– రేణిగుంట


నోట్ దిస్ పాయింట్

ప్రచారంలో గీత దాటితే..

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందట్లో పార్టీలూ కార్యకర్తలూ నిబంధనలు మరచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారాలకు స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ...

– వెంకటగిరి/దక్కిలి

- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యాసంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి
- ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు, వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫోటోలు, అభ్యర్థి ఫోటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫోటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగల బెట్టకూడదు.



విశేషం

'పేట' హ్యాట్రిక్ వీరుడు


మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పిట్ల వెంకటసుబ్బయ్య

సూళ్లూరుపేట హ్యాట్రిక్ వీరుడిగా పిట్ల వెంకటసుబ్బయ్యను అందరూ తలచుకుంటారు. పదహారేళ్ల ఎమ్మెల్యేగా చేసిన ఆయన పింఛను మీద ఆధారపడే చివరిదాకా జీవించారు. 1962లో సూళ్లూరుపేట నియోజకవర్గం ఏర్పడింది. 1967లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పిట్ల వెంకటసుబ్బయ్య పోటీ చేసి, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి మేర్లపాక మునస్వామిపై 1853 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన కటారి మునస్వామిపై 11,425 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978 ఎన్నికల్లో జనతాపార్టీ అభ్యర్థి దొడ్డి వీరాస్వామిపై 21,414 ఓట్ల తేడాతో విజయఢంకా మోగించారు. ఈ హ్యాట్రిక్ రికార్డు సూళ్లూరుపేటలో ఇప్పటిదాకా ఎవ్వరూ బ్రేక్ చేయలేకపోయారు. 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పరసా వెంకటరత్నయ్య రెండుసార్లు గెలుపొందినా, 2004లో ఓడిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. మూడోసారి పోటీ చేస్తున్నారు.

– తడ



ఎన్నికల ప్రచారంలో చంద్రశేఖర రెడ్డి


ఇదేమి 'స్టాండ్' వకీల్ సాబ్

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆయన తిరుపతి నగరపాలక సంస్థలో స్టాండింగ్ కౌన్సిల్ లాయర్. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి న్యాయపరమైన వివాదాలను పరిష్కరించడం చంద్రశేఖర రెడ్డి విధి. అందుకు నెలవారీ వేతనం కూడా కార్పొరేషన్ సాధారణ నిధులు నుంచి చెల్లిస్తోంది. ఈ మధ్యనే ఆయన వేతనాన్ని పెంచుతూ కౌన్సిల్లో తీర్మానం చేశారు. ఆ కృతజ్ఞతతోనో ఏమో వైసీపీ ఎన్నికల ప్రచారంలో వీర సైనికుడిలా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ జెండాను తలపాగా చుట్టి, టీషర్టుకు జగన్‌రెడ్డి సిద్ధం లోగో తగిలించుకుని సందుల్లో, గొందుల్లో తిరుగుతూ స్వామి భక్తి చాటుకుంటున్నారు. అది కూడా చిన్నపిల్లల చేత జెండా పట్టించి ప్రచారంలో పాల్గొంటున్నారు. తిరుపతి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ వ్యవహరిస్తున్నారు. ఆమె ఇలాకాలోనే ఇలా బరితెగించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బీ-ఫారం.. ఏ-ఫారం అంటే..!

● మీకు తెలుసా ?

ఎన్నికల సమయంలో తరచూ ఏ-ఫారం, బీ-ఫారం అనే పదాలు వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వీరే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ, ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందజేస్తారు. నామినేషన్ నామినేషన్ పత్రంతోపాటైనా లేదా పరిశీలన సమయంలోనైనా రిటర్నింగ్ అధికారికి బీ-ఫారం అందించాలి. ఇలా బీ-ఫారం సమర్పించిన అభ్యర్థికే ఎన్నికల కమిషను ఆ పార్టీల గుర్తులను కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తారు.



● ఇక, పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారం అందిస్తారు. బీ ఫారం ఇచ్చే అధికారాన్ని ఆ ప్రతినిధికి అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారం తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారం ఇచ్చినట్లు స్పష్టం చేయాలి.

- చిత్తూరు కలెక్టరేట్

● నోట్ దిస్ పాయింట్

● 2009 నియోజకవర్గాల పునర్విభజనతో కొత్తగా ఏర్పడిన నియోజకవర్గాలు: పూతలపట్టు, జీడీనెల్లూరు

● అంతరించి పోయినవి: పుత్తూరు, వేపంజేరి

నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. నగరి, విజయపురం, నిండ్ర మండలాలు చిత్తూరు జిల్లాలో, పుత్తూరు, వడమాలపేట తిరుపతి జిల్లాలో ఉన్నాయి. కానీ, నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ బాధ్యత పూర్తిగా చిత్తూరు కలెక్టర్‌దే.

● హెచ్చరిక



రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే

కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్పీ చట్టం 1951 సెక్షన్ 125, ఐసీపీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171ఇ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- చిత్తూరు

సిగ్గు పడాలా.. వద్దా?



'పొరుగు'ముందు తలవంపులు!

● ఇతర రాష్ట్రాల గ్రామాల ముందు ఏపీ గ్రామం తీసికట్టు ● సదుపాయాలు, సౌకర్యాలు సున్నా

జగన్ బటన్ నొక్కితే జనం అకౌంట్లలో కాసులు పడుతున్నాయో లేదో కానీ.. గ్రామాలు మాత్రం ఆయన ఐదేళ్ల పాలనలో బీడుపడ్డాయి. పంచాయతీ నిధులు పక్కదారి పట్టగా, కనీసమైన సదుపాయాలకు, సౌకర్యాలకు నోచుకోక అలో లక్ష్మణా అంటూ ఆవేదన చెందుతున్నాయి. పొరుగు రాష్ట్రాల గ్రామాలతో పోలిస్తే ఏపీ గ్రామాలు నిజంగానే ఎడారులను తలపిస్తున్నాయి. కరెంటు లేక పొలాలు బీళ్లు పడితే, తాగేనీళ్లు లేక ప్రజల గొంతులు ఎండుతున్నాయి. వీధులు, మురుగునీటి కాలువలు, వీధి లైట్లు.. అన్నింటికీ అన్ని సదుపాయాలూ పొరుగు రాష్ట్రాలతో చూస్తే తీసికట్టుగా ఉంది. మూడు రాష్ట్రాల కూడలిలోని కుప్పం నియోజకవర్గంలోని ఎంకేపురాన్ని.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని వేపనపల్లె, బెండవారం గ్రామాలను 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ మూడు గ్రామాల్లోని సదుపాయాలు, సౌకర్యాలు, సమస్యలను పోలుస్తూ ఇస్తున్న సచిత్ర కథనమిది. - కుప్పం



ఎంకే పురం (ఆంధ్రప్రదేశ్)

మండల కేంద్రమైన శాంతిపురానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కేంద్రమిది. కనీసం గ్రామం పేరును సూచించే బోర్డు లేదిక్కడ. పాత పంచాయతీ భవనంమీద రాతను చూసి ఇది ఎంకేపురం అని తెలుసుకోవాలి. ఈ గ్రామాన్ని పరిశీలిస్తే..



తాగునీటి కష్టం : ఊళ్లోని బోరునుంచి వస్తున్న తాగునీళ్లు ఏమాత్రం చాలడంలేదు. కనీసం పైపు లైన్లు వేసే దిక్కు లేదు. పంచాయతీ పాలకులను, అధికారులను అడిగి అడిగి విసిగిపోయిన ప్రధాన వీధిలోని సుమారు పది కుటుంబాలు ఏడాది కిందట దాదాపు రూ.10 వేలు సొంత నిధులు ఖర్చు చేసి పైపులైన్ వేయించుకున్నాయి. డబ్బు, శ్రమ వృథానే తప్ప వీరిదాకా నీళ్లు రావడంలేదు. దీంతో రచ్చబండ దగ్గర ఉన్న బోరునుంచి నీటిని బిందెల ద్వారా మోసుకొస్తున్నారు.

శుద్ధ జలం ఏదీ? : టీడీపీ హయాంలో ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ఒక ట్యాంక్ ఏర్పాటు చేసి రూ.2కే గ్రామమంతా శుద్ధ జలం సరఫరా చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ ట్యాంకు మూలన పడింది. తుప్పు పట్టిన ఈ ప్లాంటు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి.



విద్యుత్తు సరఫరా దారుణం

కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు కోతలు విధిస్తారో తెలియని పరిస్థితి. అన్ని విద్యుత్తు స్తంభాలకు లైట్లున్నా.. ముప్పావువంతు వెలగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు చెప్పినా లైట్లు మార్చలేదన్నారు.



మురుగుకంపు : గ్రామం ముఖద్వారంలో అతిపెద్ద మురుగునీటి కాలువ కనీసమైన నిర్వహణ లేక కంపు కొడుతోంది. ఈ కాలువను ఊరి చెరువులో కలిపారు. ఇక గ్రామం లోపలి కాలువలు చాలావరకు ధ్వంసమయ్యాయి. ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. అంటువ్యాధులకు కారణమవుతోంది.



అసంపూర్తిగా కమ్యూనిటీ హాలు

టీడీపీ హయాంలో నిర్మాణం మొదలు పెట్టిన కమ్యూనిటీ హాలును వైసీపీ ప్రభుత్వం అలాగే వదిలేసింది. ప్రస్తుతం ఈ అసంపూర్తి భవనాన్ని గ్రామస్థులు పశువులు కట్టుకోవడానికి, ట్రాక్టర్లు నిలబెట్టుకోవడానికి, గడ్డి మోపులు పెట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు.



వీధులు అధ్వానం

గ్రామంలోని చాలావరకు సిమెంటు రోడ్లు లేవు. గుంతలు మిట్టలుగా ఉన్న మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. కొన్ని వీధులకు ఎప్పుడో వేసిన సిమెంటు రోడ్లు కంకర తేలాయి.



ఈ రోడ్లనూ పట్టించుకునే దిక్కేది?

గ్రామంలోని రోడ్లే కాదు.. ఎంకేపురాన్ని మండల కేంద్రమైన శాంతిపురంతో అనుసంధానం చేసే తారు రోడ్డు చాలాచోట్ల గుంతలు పడి, ప్యాచ్‌లతో దారుణంగా ఉంది. కర్ణాటక సరిహద్దు రాయికి ఇవతల మన ఏపీ రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. గుంతలు తేలి, దుమ్ము రేగుతూ ఉంది.



బెండవారం (కర్ణాటక)

కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకాలోని పంచాయతీ కేంద్రమిది. శాంతిపురం మండలం ఎంకే పురం పంచాయతీకి కేవలం ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉంది. సరిహద్దు అవతల ఉన్న ఈ గ్రామంలో అన్ని సదుపాయలతో ప్రజలు జీవనం సాగిస్తున్నారు.

అందుబాటులో శుద్ధ జలం

పంచాయతీ మధ్యలోనే శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేసి రూ.5కు 20 లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎప్పుడు వెళ్లినా నీళ్లు అందుబాటులో ఉంటున్నాయి. ప్రభుత్వాలు మారినా శుద్ధ జలం ప్లాంటు నిర్వహణను విస్మరించడంలేదు.





ప్రతి ఇంటి ముందూ కొళాయిలు

వీధివీధినా పైపులైన్లు వేసి ఇంటింటికీ కొళాయి పెట్టారు. రోజులో రెండు సార్లు.. రెండుమూడు గంటలపాటు నీళ్లు వదులుతున్నారు. ప్రస్తుతమైతే నేరుగా బోరునుంచే పైపులైన్లు వేశారు. రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇది అందుబాటులోకి వస్తే 24 గంటలూ తాగునీరు అందుతుందని స్థానికులు తెలిపారు.



ఎటు చూసినా సిమెంటు రోడ్లు, కాలువలు

గ్రామంలోని అన్నీ సిమెంటు రోడ్లే. అవి కూడా శుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి వీధికీ సిమెంటు కాలువలు నిర్మించారు. అక్కడక్కడా కొద్దిగా కాలువల్లో చెత్త కనిపిస్తున్నా, ఆ చెత్త అడ్డు పడే పరిమాణానికి పెరిగే సమయానికి పంచాయతీ వారు శుభ్రం చేసేస్తారని స్థానికులు తెలిపారు. ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండటం లేదు.



24 గంటలూ విద్యుత్తు సరఫరా

గ్రామానికి 24 గంటలూ విద్యుత్తు సరఫరా అవుతోంది. నాలుగుచోట్ల ప్రధాన కూడళ్లలో స్పన్ పోల్స్ ఏర్పాటు చేసి ఎనిమిదేసి పెద్ద డూమ్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇవిగాక వీధుల్లోని విద్యుత్తు స్తంభాలకూ లైట్లు అమర్చారు. వీటి వెలుగుల్లో గ్రామం కాంతులీనుతోంది.

రహదారులు బాగున్నాయ్

తాలూకాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు.. పొరుగు రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రోడ్ల నిర్వహణ బాగుంది. గుంతలు, డ్యామేజీ కనిపించడంలేదు.






వేపనపల్లె (తమిళనాడు)

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి తాలూకాలోని పంచాయతీ కేంద్రం వేపనపల్లె. కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది చిన్న పట్టణంగా అభివృద్ధి చెందిన ఈ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అన్నీ అమరాయి.

శుద్ధ జలమూ ఉంది

గ్రామానికి రెండు శుద్ధ జలం ప్లాంట్లు ఉన్నాయి. రూ.5కే 20 లీటర్ల నీటిని అందిస్తున్నారు. రోజులో ఎప్పుడు వెళ్లినా నీళ్లు అందుబాటులో ఉంటోంది. ఈ రెండు పాంట్లలో ఒకటి రెండు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. త్వరలోనే బాగుచేసి అందుబాటులోకి తెస్తారని గ్రామస్థులు అక్కడి పంచాయతీ పాలకుల తీరుపై విశ్వాసం వ్యక్తం చేయడం విశేషం.





కొళాయి తిప్పితే నీళ్లే

గ్రామంలోని ప్రతి ఇంటి ముందూ కొళాయి ఏర్పాటు చేశారు. రెండు ఇళ్ల మధ్య ఐదారు అడుగుల దూరమున్నా రెండు కొళాయిల ఉంటాయి. ప్రత్యేకంగా రక్షిత మంచినీటి ట్యాంకు ద్వారా 24 గంటలపాటూ తాగునీరు సరఫరా అవుతుంది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ.. సిమెంటు రోడ్లు



వేపనపల్లెలో మురుగునీటి కాలువలు నిర్మించి దానిపై ప్లేట్లు వేసి మూసేశారు. ఆపైన వీధులలో రోడ్లు వేశారు. అక్కడక్కడా మ్యాన్ హోల్స్ పెట్టారు. ఎక్కడైనా మురుగు నిలిచిపోతే ఈ హోల్స్‌ను తెరచి శుభ్రం చేస్తారన్న మాట. ఇంకా కొన్నిచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు కావాల్సి ఉంది. అలాంటి చోట మాత్రం కొద్దిగా పారిశుధ్యం క్రమం తప్పింది. ఇక, గ్రామ వీధులన్నీ సిమెంటు రోడ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజలు కూడా ఇళ్ల ముందు రోడ్లలో చెత్తాచెదారం పడకుండా శుభ్రంగా ఉంచుకుంటున్నారు.

ఇక్కడా 24 గంటల విద్యుత్తు

గ్రామంలో విద్యుత్తు సరఫరా 24 గంటలూ ఉంటోంది. వీధి లైట్లు ఏర్పాటు చేయడం తక్కువే. ఇవి రిపేరైతే మాత్రం వెంటనే మరమ్మతులు చేయిస్తున్నారు.



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ ర్యాంకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో తిరుపతికి చెందిన నారాయణ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేటగిరీలో రాయపాటి పుష్కర్ 225 ర్యాంకు సాధించగా, గుండా జోష్మిత.. దివ్యాంగుల కేటగిరీలో ఎనిమిది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో రెండో ర్యాంకు వచ్చింది. వీరితోపాటు ప్రసాద్ 253, జశ్వంత్ 255, హితేష్ రాహుల్ 274, వివేకానందరెడ్డి 285, మునివెంకటరెడ్డి 324, ప్రకాష్ 384, సాయిప్రసన్న 512, మైత్రిశ్రీ 553, కృష్ణ 608, వివస్వత్ 1629, నాగసుమేధ్ 3819, బాలాజి 4712, రుత్వికరెడ్డి 4945, ఆదిత్య నివాస్ 5303 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు 12, ఐదు వేలలోపు 28, పదివేలలోపు 34 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని నారాయణ డీజీఎం కొండలరావు, ఏజీఎం గోపీచంద్ తెలిపారు. ఉపాధ్యాయులతో కలిసి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కంప్యూటర్ ఇంజనీర్ అవుతా



మాది రామచంద్రాపురం మండలం నూతిగుంట పల్లె. ఉపాధ్యాయుడు రాయపాటి నాగేశ్వరనాయుడు, నెల్లూరి పుష్ప మా తల్లిదండ్రులు 300 మార్కులకు గాను 291 మార్కులు సాధించా. మ్యాథ్స్ కెమిస్ట్రీలో నూటికి నూరు శాతం మార్కులు వచ్చాయి. ఓపెన్ కేటగిరీలో 225 ర్యాంకు వచ్చింది. చిన్నప్పటినుంచి కంప్యూటర్ ఇంజనీర్ కావాలనేది నా లక్ష్యం. తదుపరి దశల్లోకూడా మంచి మార్కులు సాధించి నా లక్ష్యం నెరవేర్చుకుంటా.

- రాయపాటి పుష్కర్ (225 ర్యాంకు, ఓపెన్ కేటగిరి)

చెన్నై ఐఐటీలో సీటు సాధించడమే ధ్యేయం



మాది తిరుపతి కరకంబాడి. కిరాణా దుకాణం నడిపే శ్రీనివాస్, తల్లి సుమలత మా తల్లిదండ్రులు. నాకకు దివ్యాంగుల కేటగిరీలో ఎనిమిది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో రెండో ర్యాంకు వచ్చింది. కంప్యూటర్స్ నాకు ఇష్టం. అందువల్ల చెన్నై ఐఐటీలో సీటు సాధించడమే నా ధ్యేయం.

- గుండా జోష్మిత (2వ ర్యాంకు, దివ్యాంగుల కేటగిరి)

ఊరందూరువాసికి 253వ ర్యాంకు

శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరుకు చెందిన నాగోలు సురేంద్రరెడ్డి, ప్రవీణ దంపతుల కుమారుడు యశ్వంత్ కుమార్‌రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 253వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి రాజమండ్రిలోని తిరుమల కాలేజీలో ఇంటర్ పూర్తి చేశాడు. అక్కడే శిక్షణ తీసుకుని పరీక్ష రాశాడు. తల్లిదండ్రులిద్దరూ అగ్రికల్చర్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు.



తల్లిదండ్రులతో యశ్వంత్

- తొట్టంబేడు

రేపు పాలిసెట్

తిరుపతి, గూడూరులో పరీక్ష కేంద్రాలు

హాజరు కానున్న 5,119మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ శనివారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. జిల్లాలో తిరుపతి, గూడూరుల్లోని 14 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షకు 5,119మంది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం 9.30గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని, 10గంటలనుంచే లోనికి అనుమతిస్తామని చెప్పారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. తిరుపతిలోని ఎనిమిది సెంటర్లలో 3,972మంది విద్యార్థులు, గూడూరులోని ఆరు సెంటర్లలో 1,147మంది విద్యార్థులు కలిపి మొత్తంగా 5,119మంది పరీక్ష రాయనున్నారని వివరించారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

రాష్ట్రస్థాయిలో టెన్త్‌లో నాల్గవ, ఇంటర్‌లో మొదటిస్థానం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 25: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదలచేసిన ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఇంటర్‌లో 87.40శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటిస్థానం, టెన్త్‌లో 86.59శాతం ఉత్తీర్ణతతో నాల్గవస్థానం సాధించారని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. గతనెలలో జరిగిన టెన్త్ పరీక్షలకు జిల్లాలో 1066మంది విద్యార్థులు హాజరవగా.. 923మంది పాసై 86.59శాతం ఉత్తీర్ణత నమోదు చేశారన్నారు. ఇంటర్ పరీక్షలకు 2540మంది విద్యార్థులు హాజరవగా.. 2220మంది విద్యార్థులు పాసై 87.40శాతం ఉత్తీర్ణత నమోదు చేశారని వెల్లడించారు.

జూన్ 1నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఏపీఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటినుంచి ఎనిమిదో తేదీవరకు జరగనున్నాయి. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30గంటలవరకు పరీక్షలు జరుగుతాయని డీఈవో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులు ఈనెల29నుంచి మే4వతేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. అపరాధ రుసుంతో మే10వతేదీ వరకు గడువుందని తెలిపారు. ఇంటర్మీడియట్ థియరీకి ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్ ఫీజు రూ.100 చెల్లించాలి. టెన్త్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలని సూచించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

మృతదేహం అప్పగింత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25: డాక్టర్ అశ్విని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటకు చెందిన డాక్టర్ అశ్విని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె తరపు బంధువులు తమిళనాడు నుంచి బుధవారం రాత్రి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. కొద్ది రోజులుగా అశ్వినిని ప్రాక్టీస్ చేయొద్దంటూ భర్త రాజేష్‌తో పాటు అత్తమామలు వేధించారని, తమ బిడ్డ ఆత్మహత్యకు ప్రేరేపించేలా వేధించారంటూ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం పూర్తి చేసి శవాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రారాజు తెలిపారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా గురు దక్షిణామూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా కలసస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణ కవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు.

తారకరామనగర్‌ను ఆదర్శంగా అభివృద్ధి చేస్తా

సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

తారకరామనగర్, ఏప్రిల్ 25: తారకరామనగర్‌ను ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేసి చూపుతానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ఇంటింటికీ మీ బొజ్జల కార్యక్రమాన్ని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జాడే లేదన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే తారకరామనగర్‌లో పూర్తిస్థాయిలో తారురోడ్లు, సబ్‌రోడ్లు, వీధికాలువలు, భూగర్భ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో ఆక్రమణకు గురైన ఇళ్ల స్థలాలు పేదలకు దక్కేలా చేస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయ సాధనతో శ్రీకాళహస్తిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రజలు సహకరించాలన్నారు. సుధీర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న డాలర్స్ దివాకర్ మాట్లాడుతూ ఇన్ని వేల గృహాలున్న కాలనీలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలోనే అన్నివర్గాల అభివృద్ధి జరుగుతుందని, ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి సుధీర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాలనీలో మహిళలు మంగళహారతులు పట్టి పూలమాలలు, దుశ్శాలుతో సత్కరించారు. యువకులు ద్విచక్రవాహనాల్లో యువకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జినాయుడు, టీడీపీ బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

తొట్టంబేడు, ఏప్రిల్ 25: శ్రీకాళహస్తి మండలంలోని గొల్లపల్లెకు చెందిన వైసీపీ నాయకులు భూపతి, శివకుమార్, భాస్కర్, అరుణాచలం, రాజశేఖర్, వెంకటాద్రి, బాబు, జానకిరామ్ టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రొఫెషనల్స్ విభాగం ప్రధాన కార్యదర్శి చాళుక్య, నియోజకవర్గ అధ్యక్షుడు మోహన్‌లాల్, ఉపేంద్ర, బాను, విష్ణు, మౌళి, శివ, పవన్ తదితరులు సుధీర్‌రెడ్డిని ఊరందూరులోని ఆయన నివాసంలో కలిశారు.



టీడీపీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

తిరుపతిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా: వరప్రసాద్





స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వరప్రసాద రావు - కొల్లూరి లక్ష్మిని సత్కరిస్తున్న నాయకులు

కోట, గూడూరు, ఏప్రిల్ 25: తనకు మరోసారి అవకాశం ఇస్తే తిరు పతి పార్లమెంట్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. గురువారం ఆయన కోట పట్టణంలోని ఓ ప్రార్థన మం దిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గూడూరు ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. అక్కడ నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అక్కడ నుంచి నేరుగా గూడూరు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ అభ్యర్థులకు అండగా ఉండాలని కేంద్రంలో మోదీని ప్రధాన మంత్రిగా చేయాలని, రాష్ట్రంలో చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. వారితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం ఆయన పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను కలుసుకొని మద్దతు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, పొదలకూరు ఆర్యవైశ్య ప్రముఖులు శ్రీనివాస్, అమల్తూరి చెంచయ్య, పొట్టి సుధాకర్, సురేంద్ర, కామేశ్వర రావు, మీరా మధు, కృష్ణం వెంకటరమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అయోధ్య రామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరప్రసాద్ సతీమణి విస్తృత ప్రచారం

రాపూరు/పొదలకూరు: తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి కోరారు. గురువారం ఆమె రాపూరు, పొదలకూరులలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

శ్రీకాళహస్తి/సత్యవేడు: ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ముగిసింది. శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానానికి 44 నామినేషన్లు దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారి రవి శంకర్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 27మంది అభ్యర్థులకు 44 నామినేషన్లు వచ్చాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్క్రూట్నీ జరగనున్నట్లు ఆర్వో తెలిపారు. సత్యవేడు అసెంబ్లీ స్థానానికి మొత్తం 39 నామినేషన్లు అందినట్లు రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 25: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, పలుశాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

రేణిగుంటకు పవన్ కల్యాణ్

రేణిగుంట, ఏప్రిల్ 25: జనసేన అధినేత పవన్ కల్యాణ్ రేణిగుంట విమానాశ్రయానికి వచ్చారు. గురువారం మధ్యాహ్నం విశాఖపట్టణం నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట పాత విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం కోడూరులో జరిగే ఎన్డీఏ కూటమి సభలో పాల్గొనేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.

టీడీపీలో చేరికలు

రేణిగుంట, ఏప్రిల్ 25: రేణిగుంట పంచాయతీ 1వ వార్డు మెంబరు విజయలక్ష్మి, వైసీపీ పట్టణ కార్యదర్శి జగన్ గురువారం టీడీపీలో చేరారు. వారికి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సాయంత్రం పంచాలినగర్‌లో రిషితారెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గంగమ్మ ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డితో పాటు పలువురు యువకులు టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన వారితో బొజ్జల రిషితారెడ్డి

వైసీపీని ఇంటికి పంపండి



మోదుగులపాళెంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, ఏప్రిల్ 25: త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం మోదుగులపాళెంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి, పొన్నారావు, నాగరాజు నాయుడు, మల్లికార్జున నాయుడు, రవినాయుడు, మాధవయ్య, గిరి నాయుడు, కేశినేని సుబ్రహ్మణ్యం, మస్తాన్, దొరస్వామి నాయుడు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంబాకం అడువుల్లో మంటలు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 25: వరదయ్యపాళెం మండలం కాంబాకంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ సమీప అటవీ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి సత్యవేడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు.

నగరిని దోచుకున్న రోజాను ఇంటికి పంపండి: భాను

నగరి, ఏప్రిల్ 25: నగరిని నిలువునా దోచేసిన మంత్రి రోజాను ఇంటికి సాగనంపాలని టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. నగరి మండల పరిధిలో గురువారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 9గంటలకు మాంగాడు నుంచి ప్రారంభమైన ప్రచారం రాత్రి 10గంటలకు ముడిపల్లి రామాపురంతో ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా అండ్ కో మట్టి, గ్రావెల్, ఇసుకను తమిళనాడుకు తరలించి కోట్లాది రూపాయలు పోగేసుకున్నారన్నారు. ప్రజలంతా అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటు పడే తెలుగుదేశం పార్టీకి ఓటేసి తనను గెలిపించాలని కోరారు. అలాగే నగరిలోని 25, 26వ వార్డుల్లో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలను గురించి వివరిస్తూ ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాదరావును, ఎమ్మెల్యే అభ్యర్థి భానుప్రకాష్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జ్యోతినాయుడు, గుణశేఖర్, ఖాదర్ భాయ్, బాలాజీ, శ్రీధర్, బాబురెడ్డి, మదన్ కుమార్, టీఎన్‌టీయూసీ కుమార్, శ్రీనివాసులు, మణికంఠం, పాలేగారు వెంకటరమణ, భీమా, బాలాజీ, చంద్ర, భరత్, గోపీనాథ్, సోము, మణి, అశోక్, రమేష్ రెడ్డి, కృష్ణవేణి, మీరా, దుర్గా, వాసంతి బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



నగరి మండలం గుండ్రాజుకుప్పంలో భానుప్రకాష్ ప్రచారం

వడమాలపేట: మండలంలోని ఎస్వీపురం ఉపసర్పంచ్ నాగమణి తన అనుచరులతో తిరుపతిలోని గాలి భానుప్రకాష్ నివాసంలో టీడీపీలో చేరారు. అలాగే పత్తిపుత్తూరు పంచాయతీ అమ్మగుంటలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మునిరత్నం ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కైలాష్ వాంఖడే

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25: మున్సిపల్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు కైలాష్ వాంఖడే గురువారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డితో కలిసి 53, 54, 55 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ర్యాంప్‌ల ఏర్పాటును పరిశీలించారు. 85ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, బీఎల్‌వోలు ఉన్నారు.

ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి

వడమాలపేట, ఏప్రిల్ 25: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వస్తేనే అధోగతిలో ఉన్న రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు మునిరత్నం చెప్పారు. గురువారం వడమాలపేట మండలం పత్తిపుత్తూరు పంచాయతీ అమ్మగుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగరి నియోకజవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని కోరుతూ ఓటర్లకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయులు నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిరెడ్డి, వెంకటయ్య, మునిశేఖర్, గోపి, లంబు, వనజమ్మ, రవినాయుడు, అంజెయ్య, లక్ష్మీప్రసన్న, శివరాయల్, వేణు, శేఖర్‌నాయుడు, చైతన్య, రవి తదితరులు పాల్గొన్నారు.



అమ్మగుంటలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు